ప్రజాశక్తి
గురువారం 8 ఫిబ్రవరి 2024
8 పేజీలు

రిక్తహస్తం

- బడ్జెట్‌లో ఉమ్మడి కృష్ణాజిల్లాకు నిరాశే
- కీలక ప్రాజెక్టుల ప్రస్తావన శూన్యం
- రహదారుల నిర్మాణం ఊసేలేదు
- అవుట్‌ఫాల్ డ్రెయిన్ల నిర్మాణంపై ఉదాశీనత
- జగనన్న కాలనీల్లో కనీస వసతులు కరువే



ప్రజాశక్తి-కృష్ణా ప్రతినిధి

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఉమ్మడి కృష్ణాజిల్లాకు రిక్తహస్తమే మిగిలింది. పలు కీలక ప్రాజెక్టులకు నిధుల కేటాయించకపోవడంతో అభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టులు ముందుకు సాగే పరిస్థితి లేకుండా పోయింది. ప్రధానంగా కృష్ణాజిల్లాలో కంకిపాడు, గుడివాడ రహదారితో పాటు పలు ఆర్‌అండ్‌బి రహదారులు అధ్వానంగా ఉన్నాయి. సుదీర్ఘ కాలంగా వీటి నిర్మాణాల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నా బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. కృష్ణాజిల్లాలో 125 జగనన్న కాలనీల్లో కనీస మౌలిక వసతులు కల్పించలేదు. వీటి గురించి ప్రస్తావన బడ్జెట్‌లో లేదు. గన్నవరం విమానాశ్రయం అభివృద్ధి, భూ సేకరణకు సంబంధించి, విజయవాడ తూర్పు బైపాస్ భూసేకరణకు నిధులు కేటాయించలేదు. పెనమలూరు మండలం చోడవరం, మోపిదేవి మండలం బండికొళ్లంక వద్ద బ్యారేజీలకు డిపిఆర్ తయారైనా ఎటువంటి ప్రస్తావన లేదు. ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించి కీలకంగా కోడూరు, నాగాయలంక, కృత్తివెన్ను మండలాల్లో ఏడు అవుట్‌ఫాల్స్ నిర్మించాల్సి ఉంది. వీటికి సంబంధించి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినా విస్మరించారు. గత నాలుగేళ్లుగా జిల్లాలో చేపట్టిన వివిధ అభివద్ధి పనులకు సంబంధించి కోట్లాది రూపాయలు బిల్లులు నిలిచిపోయినా వాటి ఊసే లేకుండా పోయింది. ఈ బడ్జెట్లోనైనా నిధులు కేటాయిస్తే దిగువ ప్రాంతం రైతాంగానికి సాగునీటి సమస్యతో పాటు ఆ ప్రాంత ప్రజలకు మంచినీటి సౌకర్యం కూడా కలుగుతుందని ఆశించినా నిరాశే మిగిలింది. అసంపూర్తిగా మిగిలిన పనులు, డ్రైనేజీల ఆధునికీకరణ పనులకు నిధులు కేటాయించలేదు. అపరిష్కృతంగా ఉన్న కొల్లేరు అభివద్ధి సమస్యగానే మిగిలిపోయింది. కొల్లేరు నుంచి వరద నీరు ఉప్పుటేరు ద్వారా సముద్రంలోకి కలుస్తోంది. దీని సంబంధించి మూడు రెగ్యులేటర్లు నిర్మించాలని మూడు జిల్లాల రైతాంగం ఎంతోకాలం నుంచి డిమాండ్ చేస్తోంది. ఈ రెగ్యులేటర్ల నిర్మాణానికి సంబంధించి డిపిఆర్ సిద్ధమై నిధుల కోసం ఆర్థిక శాఖ వద్ద ఫైల్ పెండింగ్లో ఉన్నా దీని ప్రస్తావన రాలేదు.

ఎ.కొండూరు మండలం చీమలపాడు పంచాయతీ వెంకటతండాలో కృష్ణాజలాల కోసం బుధవారం ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

పట్టని ఎ.కొండూరు తాగునీటి సమస్య

ప్రజాశక్తి-విజయవాడ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ (ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్)లో ఎన్టీఆర్ జిల్లాకు ప్రత్యేక కేటాయింపులేమీ జరడలేదు. ముఖ్యంగా ఏళ్ల తరబడి అసంపూర్తిగా మిగిలిపోయిన గుణదల వంతెన ప్రస్తావ లేదు.

గుణదల వంతనెకు ఈసారీ మొండిచేయి

ఎ.కొండూరు మండలం కిడ్నీ రోగులకు శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి సంబంధించిన ప్రస్తావన (మిగతా 6లో)

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు కట్టుదిట్టం

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డిల్లీరావు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: ఎన్‌టిఆర్ జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో వ్యవహరించి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణపై సమన్వయ శాఖల అధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే ప్రారంభమైన ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 20వ తేదీ వరకు జరుగుతాయని, అదే విధంగా జనరల్, ఒకేషనల్ గ్రూపులకు సంబంధించి థియరీ పరీక్షలు మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు జరుగుతాయని చెప్పారు. జిల్లాలో మొత్తం 99 కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నట్లు తెలిపారు. 40,082 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు, 35,494 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 75,576 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు వివరించారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి 99 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 29 మంది కస్టోడియన్ అధికారులను నియమించడం జరిగిందని, 18 స్టోరేజ్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. పరీక్షా పత్రాలను స్టోరేజ్ (మిగతా 6లో)

పెనమలూరులో ఆశ వర్కర్లకు నోటీసులిస్తున్న పోలీసు సిబ్బంది

చలో విజయవాడ నేపథ్యంలో

ఆశాలకు నోటీసులు

సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశ వర్కర్లు గురువారం 'చలో విజయవాడ' పిలుపునిచ్చిన నేపథ్యంలో 24 గంటలు ముందుగానే పోలీసులు వారికి నోటీసులిచ్చారు. కొన్నిచోట్ల ముందస్తు అరెస్టులకు పాల్పడగా మరికొన్ని చోట్ల గృహ నిర్బంధించారు. వివిధ కార్యకలాపాల్లో ఉన్న సిఐటియు నాయకులనూ పోలీసులు అరెస్టు చేశారు.

వార్త 5లో

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ఉద్యోగ అవకాశాలు
విలేకర్లు కావలెను
ప్రజాశక్తి దినపత్రికలో పని చేసేందుకు కింది ప్రాంతాలకు విలేకరులు కావలెను.
విద్యార్హత: ఇంటర్, ఆ పైన..
విలేకరులు కావాల్సిన కేంద్రాలు:
ఎన్‌టిఆర్ జిల్లా
- విజయవాడ నగరంలో నాలుగు ఖాళీలు
- విజయవాడ రూరల్
- జి.కొండూరు
కృష్ణాజిల్లా
- పెనమలూరు
- పామర్రు
- నాగాయలంక
- గూడూరు
- కృత్తివెన్ను
- నందివాడ
ప్రాథమిక అర్హతలు :
- తెలుగులో స్పష్టంగా రాయగల నైపుణ్యం
- జిల్లా, రాష్ట్ర రాజకీయాలపై ప్రాథమిక అవగాహన
- కంప్యూటర్ తెలుగు టైపింగ్
- ఏదైనా తెలుగు పత్రికలో ఒక సంవత్సరం అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత..
ఆసక్తి గల వారు తమ బయోడేటాను కింది నెంబర్లకు వాట్సాప్‌గానీ, vjadesk@gmail.com మెయిల్‌కుగానీ పంపగలరు
:: హాజరుకావాల్సిన చిరునామా ::
ప్రజాశక్తి కార్యాలయం
అరవింద హైస్కూల్ వద్ద, తాడేపల్లి
సంప్రదించాల్సిన నెంబర్లు
9490099206, 9490099530, 9490099218

శ్రద్ధాంజలి

జననం: 01-04-1940
మరణం: 29-01-2024
కీ॥శే॥ గొర్రెపాటి చంద్రశేఖరరావు గారు
గొర్రెపాటి ట్రస్టు నిర్వాహకులు - ఘంటశాల.
శ్రీ విజయ అకాడమీ కరస్పాండెంట్ - చల్లపల్లి.
పెద్దరికం మూర్తీభవించిన అనురాగ మూర్తి, సమాజాభివృద్ధికి తనవంతు సహకారం అందించిన మార్గదర్శి శ్రీ గొర్రెపాటి చంద్రశేఖరరావు గారు మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...నివాళులు...
ప్రిన్సిపాల్ : నాదెళ్ల భీమారావు
మరియు ఉపాధ్యాయ సిబ్బంది
విజయ పబ్లిక్ స్కూల్
విజయవాడ రోడ్డు, చల్లపల్లి, కృష్ణాజిల్లా.

ఫ్రంట్ ఆఫీసుని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలోని కోర్టు ఆవరణలోని మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్రంట్ ఆఫీసుని సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కె.శ్రావణి తెలిపారు. బుధవారం ఫ్రంట్ ఆఫీస్‌ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆఫీసులో ఉచిత న్యాయ సలహాలిచ్చేందుకు ప్యానల్ లాయర్‌తో పాటు పారా లీగల్ వాలంటీర్ అందుబాటులో ఉంటారని ఎవరికైనా సమస్యలుంటే సలహాలు పొందొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎజిపి టిఎల్. నరసింహారావు, లీగల్ సెల్ ప్యానల్ లాయర్స్ యం.విజయ కుమారి, డి.నాగేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ సిబ్బంది కష్ణ, ప్యారా లీగల్ వాలంటీర్ పాల్గొన్నారు.

టెన్త్ మోడల్ పరీక్షకు విశేష స్పందన

ప్రజాశక్తి ఇబ్రహీంపట్నం : ఇబ్రహీం పట్నం, కొండపల్లిలో ఉన్న బాలికల పాఠశాల, క్రాంతి స్కూల్, నాగార్జున స్కూల్‌లోని విద్యార్థులు మోడల్ పరీక్షలో పాల్గొన్నారు. అనంతరం క్రాంతి స్కూల్ కరెస్పాండెంట్ మురళి మోహన్, ప్రిన్సిపాల్ వెనిగళ్ళ అమ్మాజీ, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.సోమేశ్వర రావు, మాధవ్ చేతుల మీదుగా పదో తరగతి పరీక్ష పేపర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.సోమేశ్వరరావు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు పర్యవేక్షణలో జరుగుతున్న ప్రజ్ఞ వికాసం పదో తరగతి మోడల్ పరీక్ష ఇబ్రహీంపట్నం, కొండపల్లిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు, విద్యాసంస్థల విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.సోమేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు బి.మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష రాస్తున్న విద్యార్థులు

అభివృద్ధి కుంటుపడింది : చిన్ని

ప్రజాశక్తి - తిరువూరు : తిరు వూరు మండలం లో టిడిపి విజయ వాడ పార్లమెంట్ నియోజక వర్గ ఇన్‌ఛార్జ్ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆ పార్టీ నాయకులతో కలిసి బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. ఆంజనేయ పురం, చిట్టేల, చౌటపల్లి, గానుగ పాడు, జి.కొత్తూరు, పల్లెర్లమూడిలో పర్యటించి జగన్ ప్రభుత్వం అనుచరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తూర్పారబట్టారు. అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు.

పర్యావరణంపై అవగాహన

ప్రజాశక్తి విసన్నపేట : స్థానిక మండల శ్రీ సిద్దార్థ ఎలైట్ స్కూల్ యాజమన్యం ఆధ్వర్యంలో మొక్కలని నాటండి, వాటిని పరిరక్షించండి, పర్యావరణాన్ని కాపాడండి అంటూ విద్యార్థులతో కలిసి 'పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు' అంటూ నినాదాలతో ప్లగాట్స్ పట్టుకొని గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో తెల్లదేవరపల్లి సర్పంచ్ రాయల నాగమణి సురేష్ దంపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై జాగ్రత్తలు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పరిధిలో ఉన్న నేషనల్ హైవే, స్టేట్ హైవేపై రోడ్డు సేఫ్టీ వారు గుర్తించిన బ్లాక్ స్పాట్‌ల నివారణకు చర్యలు తీసుకోవాలని నందిగామ ఆర్‌టిఒఎం పద్మావతి పేర్కొన్నారు. జాగ్రత్తలపైన, నేషనల్ హైవే వారు, లోకల్ ఇంజినీరింగ్ కాలేజీ వారితో రోడ్డు సేఫ్టీ ఆడిట్ నిర్వహించారు. మోటార్ వాహన తనిఖీ అధికారి ఎంవిఎన్ రాజు, నేషనల్ హైవే ఇంజనీర్ శ్రీనివాస్ అమృత సాయి ఇంజనీరింగ్ కాలేజీ అధ్యాపకులు అంకమరావు పాల్గొన్నారు.

బ్లాక్ స్పాట్‌లో....

ఖాళీ బిందెలతో నిరసన

ప్రజాశక్తి - ఎ.కొండూరు : కృష్ణా జలాలను సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం చీమలపాడు పంచాయతీ పరిధిలోని వెంకటా తండాలో సిపిఎం ఆధ్వర్యంలో మహిళలు ఖాళీ బిందెలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సిపిఎం నాయకులు పి.ఆనందరావు మాట్లాడుతూ మండలంలోని కొన్ని గ్రామాలకు, గిరిజన తండాలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా అవుతున్న కృష్ణా జలాలు వారం రోజులుగా నిలిచిపోయాయని అన్నారు. ప్రజలు ఆయా ప్రాంతాల్లో దొరికే నీటినే తాగి పలు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కృష్ణా జలాలు తాగడం వల్ల కిడ్నీ రోగులతో పాటు ప్రజలకు కూడా ఆరోగ్య సమస్యలు తగ్గాయని ముఖ్యంగా మోకాళ్ల నొప్పులతో దీర్ఘకాలంగా బాధపడుతున్నవారికి కొంత ఉపశమనం కలుగుతుందని అన్నారు. ప్రభుత్వం వెంటనే యుద్ధ ప్రాతిపదిన కృష్ణా జలాలను సరఫరా చేయకపోతే సిపిఎం ఆధ్వర్యంలో మండల స్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆళ్ల అమ్మిమిరెడ్డి లవూరి కృష్ణ, బి.రామదాసు అంకియా గిరిజన మహిళలు పాల్గొన్నారు.

ప్రమాద ప్రదేశాల గుర్తింపు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా బుధవారం అర్‌అండ్‌బి జగ్గయ్యపేట, చిల్లకల్లు జిఎంఅర్ టోల్‌ప్లాజా వద్ద రహదారి భద్రతా ప్రమాద ప్రదేశాలపై చర్చించారు. అర్‌అండ్‌బి ఎఈ టి.వెంకట నరేంద్ర మాట్లాడుతూ జగ్గయ్యపేట నుండి ముక్త్యాల మధ్యలో గల పద్మావతి నగర్‌లో షేర్ మహమ్మద్ పేట నుండి గంట్రాయి మధ్యలో గల వంపును మెరుగు పరిచినట్లు తెలిపారు. నవాబుపేట క్రాస్ రోడ్‌లో సెంట్రల్ లైటింగ్‌కు జాతీయ రహదారి వారు అనుమతిచ్చారన్నారు. ఇందులో భాగంగా ఎం వి ఐ యం.రవి కుమార్ రహదారి భద్రతా ప్రమాద ప్రదేశాలు గురించి అర్‌అండ్‌బి, జాతీయ రహదారి వారికీ తగు సూచనలు, సలహాలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓ అండ్ ఏం మానేజర్ రాజేంద్ర కుమార్ టోల్ మేనేజర్ ప్రవీణ్, ఓఅండ్ హెచ్.రాఘవ, సిఅర్.నాగకృష్ణ, మహేష్, త్రినాధబాబు, ఆదిశేషు, కార్యాలయ సిబ్బంది సీనియర్ అసిస్టెంట్ ఎండి టి.ఆలం, విజయ భాస్కర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నరేంద్ర

చెవిటికల్లులో జనసేన ప్రచారం

ప్రజాశక్తి - కంచికచర్ల : రాష్ట్రంలో అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు సమన్వయంతో కలిసి పనిచేయాలని జనసేన నందిగామ నియోజకవర్గం సమన్వయకర్త తంబళ్లపల్లె రమాదేవి పిలుపునిచ్చారు. బుధవారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో స్థానిక చెవిటికల్లు రోడ్డులో గాజు గ్లాసులో ఛాయ్ కార్యక్రమం నిర్వహించారు. కార్మికులు, రిక్షా కార్మికులకు ఛాయ్ అందిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె వైసిపి అరాచక పాలనను గురించి ప్రజలకు వివరిస్తూ చైతన్యం చేశారు. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు వైసిపి ప్రభుత్వం గద్దె దించేందుకు ప్రజలందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొఠారు దేవేంద్ర, పెద్దినీడి హరి, పుప్పాల వేణు, రమాదేవి, హేమంత్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - విస్సన్నపేట : బైక్ ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలను బుధవారం వైసిపి తిరువూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి నల్లగట్ల స్వామిదాస్ పరామర్శించారు. విస్సన్నపేట మండలం కొండపర్వ గ్రామానికి చెందిన కోలా మల్లిఖార్జునరావు(24), మానికల విజయబాబు (26) మంగళవారం రాత్రి బైక్ ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే. వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

18 కేంద్రాల్లో మోడల్ పరీక్ష

ప్రజాశక్తి - నందిగామ : పదో తరగతి ప్రజ్ఞా వికాసం మోడల్ పేపర్ కు స్పందన లభించింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గోపి నాయక్ మాట్లాడుతూ బాగా చదవండి పరీక్షలకు సిద్ధం కండి అనే నినాదంతో ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా పదో తరగతి విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజ్ఞ వికాసం పరీక్షకు పెద్ద ఎత్తున విద్యార్థుల స్పందన లభించిందన్నారు. ఈ పరీక్షల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుండి 1000 మంది విద్యార్థులు పాల్గొన్నారు. నందిగామ పట్టణంలో 18 పరీక్ష కేంద్రాల్లో మోడల్ పరీక్ష నిర్వహించారు. విద్యార్థులు సామాజిక కృషిని చైతన్యాన్ని పెంచేందుకు పరీక్ష దోహదపడతాయని ఇటువంటి పరీక్షలు నిర్వహించిన ఎస్ఎఫ్ఐ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. నేడు విద్యారంగం నేటి విద్యార్థులే రేపటి పౌరులుగా రేపు జరగబోయే పబ్లిక్ పరీక్షల్లో ఎటువంటి భయాందోళనకు గురి కాకుండా ఎంతో ఉత్సాహంగా పాల్గొని ఈ శక్తి సామర్థ్యాన్ని నిరూపించుకోవలసిన సమయాన్ని అన్నారు.పరీక్ష మీ ప్రతిభను ప్రదర్శించే ర్యాంకుల కోసం మార్పుల కోసం పోటీ పడుతూ విద్యారంగాన్ని పూర్తిగా వ్యాపారంగా మార్చే ప్రయత్నంలో నేటి కార్పొరేట్ శక్తులకు, ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు ఎస్‌కె ఖాజా, వెంకటేష్, ప్రేమ్, రేష్మ, ఆశ, ప్రయోధర్, త్రివేణి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష రాస్తున్న విద్యార్థులు

16న సమ్మెను జయప్రదం చేయండి

ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కేంద్రంలో బీజేపీ మోడీ ప్రభుత్వ కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా, కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ 16న జరిగే సమ్మె జయప్రదం చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ సిఐటియు జాతీయ కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య పిలుపు నిచ్చారు. డ్రైవర్లతో బుధవారం ఆయన సమావేశమై మాట్లాడారు. డ్రైవర్స్‌కీ నష్టదాయకమైన ఉరితాడుగా మారిన హిట్ అండ్ రన్ కేసు రద్దు చేయాలని, జరిమానా జైలు శిక్ష డ్రైవర్స్ విధించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లు ముందు బాగుచేయాలని, డ్రైవర్స్ సంక్షేమం కోసం బోర్డు ఏర్పాటు చేయాలని, చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బందులు పడుతున్న డ్రైవర్స్‌పై ఇలాంటి హిట్ అండ్ రన్ కేసులు తీసుకురావటం డ్రైవర్స్‌తో స్టీరింగ్ బంద్ చేయటం తప్ప మరొకటి కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయిల్ అండ్ గ్యాస్ కాంట్రాక్టు వర్కర్స్‌కి వేతన ఒప్పందం చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎన్.సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ డ్రైవర్స్ కాంట్రాక్టు వర్కర్స్‌కి కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. డ్రైవర్స్ నష్టదాయకమైన చట్టాలను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి ఎం.మహేష్, హెచ్‌పిసిఎల్, ఆయిల్ డ్రైవర్స్ యూనియన్ అండ్ సిఐటియు మండల ప్రెసిడెంట్ ఎస్ సుందరరావు, కార్యదర్శి బాలకష్ణ, హెచ్‌పిసిఎల్ ఆయిల్ సెక్రటరీ శేషగిరి, కోశాధికారి గోవర్ధన్, హెచ్‌పిసిఎల్ గ్యాస్ డ్రైవర్స్ యూనియన్ సెక్రటరీ వెంకటేశ్వరరావు, ఐఒసిఐఎల్ ఆయిల్ సిఐటియు ప్రెసిడెంట్ కృష్ణ, సెక్రటరీ శేషు, బిపిసిఎల్ ఆయిల్ యూనియన్ సిఐటియు ప్రెసిడెంట్ కృష్ణ, సభ్యులు శివకష్ణ, హెచ్‌పిసిఎల్ అండ్ ఆయిల్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు సుబ్బారావు, రమేష్, భాస్కర్ పాల్గొన్నారు.

పురుగులతో ఇబ్బందులు

ప్రజాశక్తి - విసన్నపేట : కొద్దిరోజులుగా విస్సన్నపేట పరిసర ప్రాంతాల్లో సన్నని పాకే కోడి పేలు లాంటి పురుగులు రహదారులపై వెళ్లే ప్రజలను ఇబ్బందికి గురిచేస్తున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారికి, నడుచుకుంటూ వెళ్తేవారికి ఇబ్బందిగా ఉంటుందన్నారు. పురుగు మందుల వినియోగం ఎక్కువ అవడం వలన చెట్లపై ఉండే పురుగులు ఊళ్ళలోకి వస్తున్నాయి. పైగా ఇప్పుడు మామిడి చెట్లపై, పంట పొలాలపై అనేక రకాల పురుగు మందులు అధిక దిగుబడి కోసం, పంటను కాపాడుకోవడానికి పిచికారీ చేయడం వలన ఇలాంటి పురుగులు జనాల మీద విజంభస్తున్నాయని కొందరంటున్నారు. ప్రకృతికి మనం హాని చేయడం వల్ల మనమే ఇబ్బందులు పడతామంటున్నారు.

పేటలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు శ్రీరాం రాజగోపాల్ సూచనలతో మేరకు బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని డోర్ టు డోర్ క్యాంపెన్ 100శాతం పూర్తి చేసినందుకు జగ్గయ్యపేట పట్టణంలోని 35వ బూత్ ఇన్చార్జి మేక వెంకటేశ్వర్లు, 60వ బూత్ ఇన్చార్జి గుంజ లక్ష్మణుడు, మొగిలి సైదులు, మని తదితరులను జగ్గయ్యపేట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నూకల కుమార్ రాజా, శ్రీరామ్ రాజగోపాల్, ఆయన సోదరులు శ్రీరామ్ సాయిప్రసాద్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో మీసాల చిట్టిబాబు, మొగిలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'దోపిడీపై విచారించాలి'

ప్రజాశక్తి - మైలవరం : నియోజకవర్గంలో ఉన్న సహజ వనరులను మాజీ మంత్రి దేవినేని ఉమా, స్థానిక శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్, మంత్రి జోగి రమేష్ దోచుకుంటున్నారని వీరి దోపిడీ గురించి విచారణ చేపట్టాలని మైలవరం మాజీ ఎమ్మెల్యే, మైలవరం నియోజకవర్గ పరిరక్షణ సమితి కన్వీనర్ జేష్ఠ రమేష్ బాబు డిమాండ్ చేశారు. స్థానిక సిఎంఆర్ కళ్యాణ మండపంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ దేవినేని ఉమా, ఎమ్మెల్యే వసంత నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏమిటో బహిరంగంగా ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులుగా నియోజక వర్గాన్ని దోచుకోవడమే వీరి పనా అని ప్రశ్నించారు. వైసిపి స్థానిక వ్యక్తిని ఇన్చార్జిగా నియమించడం అభినందనీయమన్నారు. అన్ని రాజకీయ పార్టీలు స్థానికులకే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అప్పిడి రాజశేఖర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి బాణావతి బాలాజీ, భాష, శేషి రెడ్డి, బ్రహ్మ రెడ్డి పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల అభివృద్ధి టిడిపితోనే సాధ్యం

ప్రజాశక్తి - కంచికచర్ల : బడుగు బలహీన వర్గాల అభివృద్ధి టిడిపితోనే సాధ్యమని నందిగామ మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీలో భాగంగా బుధవారం కంచికచర్ల పట్టణ పరిధిలోని గొట్టిముక్కల రోడ్డు, హనుమాన్ పేటలో, విజయరాణి హైస్కూల్ రోడ్డులో ఆమె పర్యటిస్తూ ప్రజలతో మాట్లాడారు. అనంతరం చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన 6 ప్యాక్ మేనిఫెస్టో గురించి ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు కోగంటి బాబు నాయకులు తాడపనేని లక్ష్మణరావు గుర్రం రామకృష్ణ గుత్తా రత్నం ఆర్ఎస్.ప్రసాద్, వేమ వెంకట్రావు గుత్తా ఓంకార్ పాల్గొన్నారు.

రైతుబజార్ల నిర్మాణానికి నిధులు

- గన్నవరం ఎఎంసి చైర్మన్ తోట కరుణ

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం నియోజకవర్గంలో నూతనంగా నిర్మిస్తున్న రైతు బజార్ల నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించినట్లు గన్నవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తోట కరుణ తెలిపారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం కమిటీ పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు, గిడ్డంగుల మరమ్మతులకు నిధులు కేటాయిస్తూ పాలకవర్గం తీర్మానాలు చేసింది. 2022-23 సంవత్సరంలో మార్కెట్ ఫీజు రూ. 2.47 కోట్లు, 2023-24లో రూ. 3.67 కోట్లు వసూలు చేయడం జరిగిందని గ్రేడ్ -1 కార్యదర్శి ఏ . కిషోర్ తెలిపారు. ప్రస్తుత మార్కెట్ యార్డు ట్రెజరి నిల్వ రూ. 14.24 కోట్లు ఉన్నట్లు వివరించారు. అనంతరం తోట కరుణ మాట్లాడుతూ...ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ఆదేశాల మేరకు వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. వీటిలో నూతనంగా నిర్మిస్తున్న రామవరప్పాడు రైతు బజారుకు రూ. 1.05 కోట్లు, తేలప్రోలు రైతు బజారుకు రూ. 72 లక్షలు, నున్న రైతు బజారుకు రూ. 50 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. గన్నవరం రైతు బజార్లో పార్కింగ్ ప్రాంతం లెవెలింగ్, అదనపు స్టాల్స్ నిర్మాణానికి రూ. 20.30 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. గన్నవరం వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోదాముల మరమ్మతులకు రూ. 35 లక్షలు, బాపులపాడు సబ్ యార్డులో గోదాముల మరమ్మతులకు మరో రూ. 17 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. వీటి టెండర్ల ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేసి పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. వైఎస్సార్ సిపి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సునీల్, గ్రేడ్ - 3 కార్యదర్శి పి. జ్యోతి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్

ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

మంచినీరు సరఫరా చేయాలని ఆందోళన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని కవుతరం గ్రామపంచాయతీ మంచినీటి కుళాయిల నుంచి ఫిల్టర్ కాని, మురికి,పచ్చని రంగు నీటిని సరఫరా చేయటం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు బుధవారం ఓవర్ ట్యాంక్ దగ్గర ఆందోళన చేపట్టారు. మేజర్ పంచాయతీ అయిన కవుతరం గ్రామంలో గ్రామ పంచాయతీ ద్వారా 280 పబ్లిక్ కుళాయిలు,250 ప్రైవేట్ కుళాయిల ద్వారా మంచి నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే కొంతకాలంగా ఫిల్టర్ బెడ్లు రిపేర్ కారణంగా చెరువులో మురికి నీటిని నేరుగా కుళాయిల ద్వారా సరఫరా చేయడం ద్వారా ప్రజలు వాడుకోవడానికి ఉపయోగకరంగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు గ్రామ స్తులు తెలిపారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు చర్యలు తీసుకొని మంచి నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి సిహెచ్ ఉమామహేశ్వరరావు ని వివరణ కోరగా ఫిల్టర్ చేసిన నీటినే కుళాయిల ద్వారా ప్రజలకు అందిస్తున్నామని అన్నారు. మూడు ఫిల్టర్ బెడ్ల్ లో ఒకటి మాత్రమే పనిచేయటం లేదని మిగతా రెండిటి ద్వారా మంచినీటిని అందిస్తున్నామని తెలిపారు. కొంతమంది స్థానికులు ఫిల్టర్ కానీ నీళ్ళ బాటిల్లో పట్టుకొని వాటిని చూపించి ఆందోళన చేయడం సబబు కాదని అన్నారు.

ఎన్‌సిసి క్యాడెట్ దమయంతికి అభినందన

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : కృష్ణా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో బి. టెక్ విద్యను అభ్యసిస్తూ ఎన్. సీ. సీ విభాగం తరపున రిపబ్లిక్ డే పరేడ్ కి ఎంపికై కర్తవ్య పథ్ లో జరిగిన రిపబ్లిక్ డే పరేడ్ లో పాల్గొన్న టి.లక్ష్మి దమయంతిని అభినందిస్తూ యూనివర్సిటీలో బుధవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథి విచ్చేసిన యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య జి. జ్ఞానమణి మాట్లాడుతూ కృష్ణా యూనివర్సిటీ నుంచి ఒక విద్యార్థిని రిపబ్లిక్ డే పరేడ్ లో పాల్గొనడం ఆనందం గా ఉందని తెలిపారు. అనేక అడ్డంకులు ఎదుర్కొని రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొన్న టి. లక్ష్మి దమయంతి అభినందనీ యురాలన్నారు. లక్ష్మీ దమయంతి విజయం ప్రతి ఒక్క విద్యార్థికి ముఖ్యంగా విద్యార్థినులకు అనుసరనీ యమన్నారు. త్వరలోనే ఎన్. సీ. సీ విభాగం నకు నూతన భవనం నిర్మించుటకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అంతేగాక ఎన్. సీ. సీ నందు చేరిన ప్రతి ఒక్క విద్యార్థిని వ్యక్తిగతం గా పర్యవేక్షిస్తున్న యూనివర్సిటీ ఎన్. సీ. సీ విభాగం అధికారి డాక్టర్ డి. రామ శేఖర రెడ్డి కి వైస్ ఛాన్సెలర్ జి. జ్ఞానమని ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా దమయంతిని సన్మానించి ఐదు వేల నగదు బహుమతి ని అందచేశారు. యూనివర్సిటీ ఎన్. సీ. సీ విభాగపు అధికారి డాక్టర్ డి.రామ శేఖర రెడ్డి, యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. విజయ కుమారి, యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పి. వి. బ్రాహ్మచారి పాల్గొన్నారు.

దమయంతిని అభినందిస్తున్న దృశ్యం

వ్యవసాయానికి రుణాలు అందించండి : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగాలకు విరివిగా రుణాలు అందించి ఉత్పాదకత పెంచే విధంగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని జిల్లా కలెక్టర్ వారి చాంబర్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ జిల్లా స్థాయి సాంకేతిక కమిటీ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరి, చెరకు, వేరుశనగ, పత్తి తదితర పంటలతో పాటు మత్స్య, ఉద్యానవన, పశు సంవర్ధక రంగాలకు పెరుగుతున్న ఖర్చులకు ఆధారంగా రుణ పరిమితిని పెంచి పంట రుణాలు అందించాలని ఆయన అధికారులకు సూచించారు. 2024-25 సంవత్సరానికి ఖరీఫ్ సీజన్‌లోని వరి పంటకు సంబంధించి ఒక ఎకరానికి రూ.42,700 ఖర్చు అవుతుండగా, రూ.83 వేల విలువైన స్థూల దిగుబడి వస్తోందని, ఆయా శాఖలు సమర్పించిన ఈ అంచనా ప్రకారం రూ.41,500 ఎకరానికి పంట రుణం అందించే విధంగా నిబంధనల ప్రకారం నిర్ణయించబడిందని బ్యాంక్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అయితే నానాటికి పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులను దృష్టిలో ఉంచుకొని ఉన్న రుణ పరిమితిని రూ.50 వేలకు పెంచే విధంగా చూడాలని రైతుల తరపున పి ప్రభాకర్ రావు అనే రైతు కలెక్టర్ ను కోరారు. వరితో పాటు చెరకు పంటకు రుణ పరిమితిని పెంచే విధంగా ప్రభుత్వానికి ప్రతిపాదించాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో కేడీసిసి బ్యాంక్ సీఈవో ఎ.శ్యామ్ మనోహర్, జనరల్ మేనేజర్ బి ఎల్ చంద్రశేఖర్, డీజీఎం పి వరలక్ష్మి, ఎల్ డి ఎం పి.యస్ జయవర్ధన్, వ్యవసాయ శాఖ అధికారిణి ఎన్ పద్మావతి పాల్గొన్నారు.

'బాబు ష్యూరిటీ' కరపత్రాల పంపిణీ

గుడివాడలో వెనిగండ్ల రాముకి పూలమాల వేస్తున్న దృశ్యం

గన్నవరం మండలంలో పాల్గొన్న యార్లగడ్డ వెంకట్రావు

ప్రజాశక్తి-గుడివాడ : రూరల్ మండలంలోని వలివర్తిపాడులో బాబు ష్యూరిటి భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య(బాబ్జీ), జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్‌తో కలసి గుడివాడ టిడిపి ఇంచార్జ్ వెనిగండ్ల రాము వలివర్తిపాడులోని ఇంటింటికి వెళ్ళి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సాయన పుష్పవతి, నాయకులు డాక్టర్ గోర్జి సత్య నారాయణ, గంటా బాలాజీ, పంద్రాజు సాంబశివరావు, కుంచనపల్లి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ప్రజాశక్తి-గన్నవరం : గత ఐదు సంవత్సరాలు కాలంగా అభివృద్ధిలో వెనుకబడిపోయిన గన్నవరం నియోజకవర్గాన్ని పెట్టుబడి పథంలో నడిపిస్తానని గన్నవరం నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ యార్లగడ్డ వెంకట్రావు హామీ ఇచ్చారు. బుధవారం రాత్రి బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం గన్నవరం మండలం మెట్లపల్లి, కొత్తగూడెం, చిక్కవరం గ్రామాల్లో నిర్వహించారు. ఈసందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గంలో అభివృద్ధి పూర్తిగా ఆగిపోయిందని, పరిశ్రమలు మూతపడటంతో ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జాస్తి వెంకటేశ్వరరావు, ఆళ్ల గోపాలకృష్ణ, బోడపాటి రవికుమార్, జూపల్లి సురేష్ పాల్గొన్నారు

పాముకాటుకు యువకుడు మృతి

ప్రజాశక్తి-కోడూరు : పాము కాటుతో యువకుడు మతి చెందిన సంఘటన కోడూరు మండల పరిధిలోని మాచవరం గ్రామంలో చోటు చేసుకుంది. బుధవారం గ్రామానికి చెందిన అప్పికట్ల రఘురాం(39) పొలంలో అపరాల(మినుముకు) మందు కొడుతూ ఉండగా పాముకాటుకు గురయ్యాడు. వెంటనే స్థానికులు అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మతి చెందాడు అని వైద్యులు తెలిపారు రఘురాం కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-అవనిగడ్డ : మండల పరిధిలోని పాత ఎడ్ల లంక గ్రామానికి చెందిన మునిపల్లి సామ్రాజ్యం(100) మృతి చెందారు. ఆమెకు 8 మంది సంతానం కాగా నాలుగు తరాల వారసులను చూసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సామ్రాజ్యం భౌతికకా యాన్ని గ్రామంలోని పలువురు ప్రముఖులు సందర్శించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

పోగొట్టుకున్న నగదు అందజేత

ప్రజాశక్తి-చల్లపల్లి : రోడ్డుపై పది రూపాయలు కనిపిస్తే తీసుకొని దాచుకునే నేటి సమాజంలో దొరికిన సొమ్మును పోగొట్టుకున్న వ్యక్తికి అందచేసిన వ్యక్తి నిజాయితీని చాటుకొని ఆదర్శంగా నిలిచారు. వివరాల్లోకి వెళితే చల్లపల్లి లక్ష్మీపురం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో సెక్యూరిటీ సిబ్బందిగా డేవిడ్ పనిచేస్తున్నాడు. బుధవారం ఓ వ్యక్తి ఎటిఎంలో నగదు తీసుకునేందుకు వచ్చి 5500 రూపాయల నగదును మర్చిపోయి వెళ్లిపోయాడు. ఇది గుర్తించిన డేవిడ్ వెంటనే బ్యాంక్ మేనేజర్ భారతి దృష్టికి తీసుకెళ్లారు. వివరాలు సేకరించి రామానగరం కూరగాయల వ్యాపారస్తుడు రాఘవయ్య గుర్తించి ఆయనను పిలిపించి నగదును అందజేశారు. సెక్యూరిటీ గార్డ్ డేవిడ్ నిజాయితీకి బ్యాంక్ మేనేజర్, స్టాఫ్, పలువురు ఖాతాదారులు అభినందించారు

రమాబాయికి ఘన నివాళి

ప్రజాశక్తి-అవనిగడ్డ : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సతీమణి కీర్తిశేషులు రమాబాయి భీమ్రావు అంబేద్కర్ జయంతిని బుధవారం అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రమాబాయి చిత్రపటానికి మాజీ జడ్పిటిసి కొల్లూ రి వెంకటేశ్వరరావు పూలదండలు వేసి నివాళ లర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ, మేడికొండ విజయ్, ఘంటసాల రాజామోహన్రావు, మండలి రామ్మోహన్రావు, యాసం శ్రీరాములు, కొల్లూరి ఇమ్మానియేల్ పాల్గొన్నారు

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ప్రతి విద్యార్థికి నులిపురుగుల మందు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో దారపు శ్రీనివాస్ కోరారు. నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా నులి పురుగుల నివారణ మందులను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులి పురుగులకు సంబంధించి మందులు మండలంలోని అన్ని ప్రభుత్వ పాటశాలల్లో పిల్లలకు పంపిణీ చేసి దాని ఆవశ్యకత నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించాలని, పిల్లలో ఆరోగ్యాన్ని నింపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధి కారులు జగన్మోహనరావు, గోపాలరావు, పి.హెచ్.సి.గుడ్లవల్లేరు కొతవరం వైద్యులు, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి ఎ.జె.ఎల్ నరసింహ రావు, ఉమా మహేశ్వరరావు, పాల్గొన్నారు.

నులిపురుగుల గోడపత్రిక ఆవిష్కరిస్తున్న దృశ్యం

పారదర్శకంగా ఓటర్ల జాబితా

కలెక్టర్ ఎస్.డిల్లీరావు

సమావేశమైన కలెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ : ఓటర్ల జాబితాలో బదిలీలను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. ఓటర్ల నమోదు, జాబితాలో సవరణలపై బుధవారం జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ ఓటర్ల జాబితా బదిలీల్లో అవకతవకలు చోటుచేసు కుంటున్నాయని వస్తున్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. ఫారం–8 కింద ఇప్పటి వరకు 6,257 దరఖాస్తులు స్వీకరించగా, ఇందులో 5,583 దరఖాస్తులు పేర్ల సవరణకు సంబంధించినవని, మిగిలిన 671 దరఖాస్తుల్లో 482 ప్రస్తుతం ఓటు హక్కు ఉన్న నియోజకవర్గంలోనే అంతర్గత చిరునామా మార్పులకు సంబంధించినవని, మిగిలిన 180 ఇతర నియోజకవర్గాలకు బదిలీని కోరిన దరఖాస్తులు ఉన్నాయని తెలిపారు. ఈసమావేశంలో డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, వివిధ పార్టీల ప్రతినిధులు వై.రామయ్య, డి.వి.కృష్ణ, వై.ఆంజనేయరెడ్డి, బి.కిరణ్, పి.ఏసుదాసు, పీవీ శ్రీహరి, ఎం.వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిసిపి కృష్ణకాంత్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - విజయవాడ : ఎన్‌టిఆర్ జిల్లా శాంతిభద్రతల డిసిపిగా బుధవారం కృష్ణకాంత్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నగర పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటాను మర్యాదపూర్వకంగా కలిశారు. కృష్ణకాంత్ పాటిల్ కర్నూలు ఎస్ఇబిలో అదనపు ఎస్‌పిగా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో ఇక్కడికి వచ్చారు.

సీతారాంకు ప్రతిష్టాత్మక పురస్కారం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : ఆరోగ్య సంరక్షణ రంగాలలో విశిష్ట సేవలను అందించిన ప్రముఖ వైద్యులు డాక్టర్ సీతారాంకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక పురస్కారం లభించిందని సీతారాం ఒక ప్రకటనలో తెలిపారు. జిందాల్ నేచర్ క్యూర్ ఇనిస్టూట్యట్ (జెఎన్ఐ) ద్వారా పలు వైద్య సేవలను అందించినట్లు తెలిపారు. ప్రధానంగా ఉబ్బసం,మధుమేహం, రక్తపోటు, కీళ్లనొప్పులు కొన్ని రకాలైన వ్యాధులకు చికిత్సఅందించడంలోఆయన విశేష కృషి చేశారని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలను ముందుగానే గుర్తించి సరైన వైద్యాన్ని అందిస్తే ప్రాణాపాయం నుండి బయట పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని జనరల్ మెడిసిన్ ఎం.డి, న్యూరాలజీ డిఎం కన్సలటెంట్ న్యూరాలజిస్ట్, అనిల్ న్యూరో ట్రామ సెంటర్ వైద్య నిపుణులు అనిల్ కుమార్ దేవరబోయిన తెలిపారు. చుట్టుగుంట అనిల్ న్యూరో ట్రామ సెంటర్ ఐదవ వార్షికోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 6,7 తేదీలలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అందులో భాగంగా నిర్వహించిన క్యాంపును సూమారు 500 మంది వరకు వినియోగించుకున్నారన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిల్ కుమార్ దేవరబోయిన మాట్లాడుతూ ఆసుపత్రి ప్రారంభించి ఐదేళ్ల కాలంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించి వారి ఆదరాభిమానాలు చూరగొన్నామని అన్నారు. ఒక టీమ్‌గా ఏర్పడి అడ్వాన్స్‌డ్ స్ట్రోక్ సెంటర్‌ను నడుపుతున్నామని, బ్రెయిన్, క్రిటికల్ కేర్ కేసులకు అత్యున్నత ప్రమాణాలతో తక్కువ ఖర్చులో వైద్యాన్ని అందజేస్తున్నామన్నారు. 10, 11వ తేదీల్లో భవానీపురం శ్రావణి హాస్పటల్స్‌లో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

బ్యుటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - విజయవాడ : మహిళలకు సుస్థిర జీవనోపాధి కల్పించటమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని మెప్మా యం. డి వి. విజయ లక్ష్మి పేర్కొన్నారు. అందుకు గాను పట్టణ ప్రగతి యూనిట్లు, ఆహా క్యాంటీన్లు, జగనన్న మహిళా మార్ట్ లు, జగనన్న ఈ – మార్ట్ లు, బ్యూటిషియన్ కోర్సు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలంతా వినియోగించుకొని ఆర్థిక సుస్థిరత సాధించాలన్నారు. ఆనూస్ వారి ద్వారా బ్యూటిషియన్ కోర్స్‌లో ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం విజయవాడలో ప్రారంభించారు. ఈకార్యక్రమంలో అనూస్ సిఇఒ అనురాధ, కృష్ణాజిల్లా పీడీ వెంకట నారాయణ, మెప్మా ఎఒ రామాంజనేయులు, మెప్మా ఎస్ఎంఎంలు ఆదినారాయణ, ఎన్ఎన్ఆర్ శ్రీనివాస్, రంగాచార్యులు పాల్గొన్నారు.

సిపిఎం కార్యాలయం ప్రారంభం

కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న బాబూరావు

ప్రజాశక్తి - అజిత్ సింగ్‌నగర్ : అజిత్ సింగ్‌నగర్ వాంబే కాలనీలో పుచ్చలపల్లి సుందరయ్య సిపిఎం కార్యాలయాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సి.హెచ్.బాబూరావు ప్రారంభించారు. బుధవారం 60వ డివిజన్ స్కూల్ సెంటర్, మెయిన్ రోడ్డు, వాంబే కాలనీలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిధిగా రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ విజయవాడ నగరంలో సిపిఎం నాయకులు చేసిన కృషి మరువలేనిదన్నారు. ఎన్నో పోరాటాలు చేసి ప్రజలకు అనేక సమస్యలపై అవగాహన కలిగించి ప్రజ పక్షాన నిలిచిందని అన్నారు. సింగ్‌నగర్ ప్రాంతంలో ఫ్లైఓవర్ రోడ్డు పూర్తి చేయడానికి ఎన్నో పోరాటాలు చేసి సాధించిన ఘనత నేటికీ కొనసాగుతోందన్నారు. సింగ్‌నగర్ వాంబే కాలనీ, రాజీవ్ నగర్ పాత రాజీవ్ నగర్ అభివృద్ధి సిపిఎం పోరాటాల వల్లే సాధ్యమైందని అన్నారు. బాబూరావు మాట్లాడుతూ అంగన్వాడీ సమస్యలపై పోరాడిది సాధించిచామన్నారు. డంపింగ్ యార్డ్‌పై నిరంతర పోరాటం చేసి సమస్య పరిష్కరించినట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యురాలు శ్రీదేవి, సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌సిహెచ్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

రంగా విగ్రహం ఆవిష్కరణ

ప్రజాశక్తి - అజిత్ సింగ్‌నగర్ : న్యూ రాజీవ్ నగర్ కట్టా ఏరియాలో వడ్డేపల్లి సామ్రాజ్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహన్‌రంగా కాంస్య విగ్రహాన్ని ఆదివారం మాజీమంత్రి సెంట్రల్ నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త వెలంపల్లి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు మోదుగుల తిరుపతమ్మ గణేష్, యర్రగొర్ల శ్రీ రాములు, తాడి శంకుతల, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని తిరుమలగిరి గ్రామంలో గల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ప్రతి రోజు జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడ, కానూరు వాస్తవ్యులు మొవ్వ ప్రవీణ్ కృష్ణ –శ్రీ సుష్మ రూ.10,116/– లు బుధవారం అందజేశారు.

న్యాయమూర్తులకు సన్మానం

ప్రజాశక్తి- నందిగామ : కృష్ణాజిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ రామకృష్ణయ్య నందిగామ సబ్ జైలు విజిట్ చేశారు. నందిగామ సీనియర్ సివిల్ జడ్జ్ లక్ష్మీరాజ్యం, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ షేక్ రియాజ్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ ఎం.రేష్మ అందరూ సబ్ జైల్ విజిట్ చేశారు. నందిగామ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ రామకృష్ణయ్యను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బొబ్బిళ్ళ పాటి భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి పి ప్రకాష్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ షేక్ అజాద్ ఏజీపి మట్టా ప్రసాద్, న్యాయవాదులు వేల్పుల ప్రభాకర్ రావు, వేల్పుల స్వామి న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆశాల సమస్యలపై వినతి

ప్రజాశక్తి - వత్సవాయి : ఆశ వర్కర్స్ సమస్యల పరిష్కారం కోసం 8న చలో విజయ వాడను జయప్రదం చేయాలని సిఐ టియు మండల కార్యదర్శి బి.రాము కోరారు. వత్సవాయిలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సుష్మాకి వినతిపత్రాన్ని అందజేశారు. రాము మాట్లా డుతూ ఆశలకు తీవ్రంగా పని భారం పెరిగిందని తక్షణమే పని భారం తగ్గించాలని, కనీస వేతనం అమలు చేయాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షలు ఇవ్వాలని వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

దుర్గమ్మ వద్ద రాష్ట్ర ఆర్థిక బడ్జెట్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : రాష్ట్ర ఆర్థిక బడ్జెట్‌ను శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ వద్ద సంబంధిత అధికారులు బుధవారం ఉంచారు. రాష్ట్ర ఆర్థిక శాఖ బృందం ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్.రావత్, ఆర్థిక శాఖ కార్యదర్శి కెవిబిజి సత్యనారాయణ, ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి బి.సునీల్ కుమార్ రెడ్డి విచ్చేశారు. వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు దుర్గమ్మ దర్శనం కల్పించారు.

ఆరోగ్య సిబ్బందికి అవగాహన

ప్రజాశక్తి - వీరులపాడు : జుజ్జూరు మండల కేంద్రంలో జల్లి ఏసోబు కమ్యూనిటీ హాల్లో మండల అభివృద్ధి అధికారి శివకుమారి అధ్యక్షతన పాఠశాల ప్రధానోపాధ్యాయులు, హెల్త్ సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈ రోజు పార్టీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి దీపిక మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతి సంవత్సరం రెండుసార్లు నులి పురుగుమందు ఏర్పాటు చేయాలని విద్యార్థుల్లో రక్త బలహీనత కడుపులో ఉన్న పురుగులు నివారించబడతాయన్నారు. మండల విద్యాధికారి కెనడి పాల్, మరో వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అల్లూరు పిహెచ్‌సి అధికారి గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లస్థలాలకు నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని టీచర్స్ కోపరేటివ్ బిల్డింగ్‌లో ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ విలేకరుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎపిఎంపిఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాఖమూరి మల్లికార్జునరావు, ఉమ్మడి కృష్ణాజిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు, యూనియన్ రాష్ట్ర నాయకులు పసుపులేటి చైతన్య, జగ్గయ్యపేట నియోజకవర్గం ఎపిఎంపిఎ అధ్యక్షులు కాకరపర్తి రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు మెటికెల శ్రీనివాసరావు, సెక్రటరీ కళ్యాణం సూర్యప్రకాష్ మాట్లాడారు. రాష్ట్రంలోని విజయవాడ ప్రాంతంలో తప్ప అనేక జిల్లాలలో అర్హులైన జర్నలిస్టులకు సంబంధించి వెరిఫికేషన్ కూడా రెవిన్యూ అధికారులు పూర్తి చేశారన్నారు. గత ప్రభుత్వం కూడా ఎన్నికల ముందు ఇళ్ల స్థలాల విషయంపై నమ్మించి మోసం చేసిందని. ఇప్పుడు కూడా అదే పరిస్థితి వస్తుందన్న ఆందోళన జర్నలిస్టులలో నెలకొందని అన్నారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలలో బడ్జెట్ ప్రవేశ పెడుతున్న దృష్ట్యా జర్నలిస్టుల ఇళ్ల స్థలాల భూములు కొనుగోలుకు సంబంధించి తక్షణమే నిధులు కేటాయింపు చేయవలసిందిగా కోరుతున్నామన్నారు.

ప్లేట్ల తయారీ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలోని దుర్గాపురంలో హోల్‌సేల్ ధరలకే బఫే ప్లేట్లు అందించే ప్లేట్ల తయారీ కేంద్రాన్ని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ మెప్మా వారి సౌజన్యంతో మహిళ సాధికారిత ధ్యేయంగా సాగుతున్న వైసిపి పరిపాలనలో మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం పాటుపడుతున్న వేళ ఒక డ్వాక్రా మహిళ తన కాళ్ళ మీద తను నిలబడేలా ప్రభుత్వం వారు అతి తక్కువ వడ్డీతో కావాల్సిన సామాగ్రిని అందజేయడం జరిగిందని, ఈ రోజు ఏర్పాటు చేసిన ఈ చిన్న వ్యాపారం భవిష్యత్తులో మంచి లాభాలు తీసుకు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకరరావు, కౌన్సిలర్ వట్టెం మనోహర్, వైసిపి పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు ఆవాల భవాని ప్రసాద్, టిఎల్ఎఫ్ ప్రెసిడెంట్ మున్నీరా పాల్గొన్నారు.

రద్దీ దృష్ట్యా దుర్గగుడిలో సౌకర్యాలు : ఆలయ చైర్మన్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దేవస్థానం పాలకమండలి ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా దుర్గగుడిలో యాత్రికులకు అనేక సౌకర్యాలు కల్పించినట్లు చైర్మన్ కర్నాటి రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం చైర్మన్ ఆధ్వర్యంలో ట్రస్ట్ బోర్డు సభ్యులు కొండ దిగువ మెట్ల పూజతో ప్రారంభమై కొండపైకి చేరుకొని అమ్మవారి దర్శనం చేసుకున్నారు. అనంతరం చైర్మన్ ఛాంబర్‌లో సంవత్సర కాలం నుండి యాత్రికుల సౌకర్యార్థం, దేవస్థానం అభివృద్ధి సంబంధించి చేపట్టిన పలు కార్యక్రమాల గురించి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులుగా ఎన్నికవడం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. దేవస్థానంలో రాత్రి పూట భోజనం ఏర్పాటు చేశామన్నారు. నూతన వధువు వరులకు ఉచితముగా అంతరాలయ దర్శనం, ఆశీర్వచనం ఏర్పాటు, భక్తులకు దుర్గా ఘాట్‌లో కృష్ణ నదిలో పూర్తి స్థాయిలో గతంలో లాగా నదీ స్నానాలకు అనుమతించినట్లు తెలిపారు. పొంగలి షెడ్డు నిర్మాణం, పొంగలి తయారీ కొరకు స్టవ్, ఇతర సదుపాయాలు కల్పించామని తెలిపారు. ఉచిత బస్సులు – కొండపై నుండి దుర్గా ఘాట్ వరకు దుర్గా ఘాట్ నుండి కొండపైకి. వికలాంగులకు వీల్‌చైర్లు ఏర్పాటు చేసామన్నారు. పెరుగుతున్న రద్దీ దృష్ట్యా భవిష్యత్‌కు అనుగుణంగా అన్నదాన భవనం నిర్మాణం, ప్రసాదం పోటు నిర్మాణం, ఎలివేటేడ్ క్యు కాంప్లెక్స్ నిర్మాణ పనులు, రాతియాగశాల నిర్మాణ పనుల శంకుస్థాపన మరియు సదరు పనులు జరుగుచున్నాయన్నారు.

ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - అజిత్ సింగ్ నగర్ : 60వ డివిజన్ వాంబే కాలనీలో ఎంఎల్ఎ వెలంపల్లి శ్రీనివాసరావు బుధవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక డివిజన్ ఇన్‌ఛార్జి బెవర నారాయణ తదితరులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రం ఇస్తూ ప్రజలతో మాట్లాడుతూ పర్యటించారు. ఈ నాలుగున్నర ఏళ్లలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తున్నామన్నారు. బొండా ఉమ చేసిన అక్రమాలపై టీవీ 5 ఛానల్‌లో ప్రచురించారన్నారు. బొండా ఉమా భూకబ్జా దారుడు కాకపోతే టీవీ5లో నిరూపించు కోవాలని సవాలు విసిరారు. సొంత చానల్లోనే తన మీద కథనాలు ప్రచురిస్తున్నా రన్నారు. సెంట్రల్ నియోజకవర్గంలో 25 వేల ఓట్ల మెజార్టీతో గెలిచి సీఎం జగన్ సీటు గిఫ్ట్ ఇస్తా అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అవుతూ శైలజ రెడ్డి, కార్పొరేటర్లు డివిజన్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

‘చలో విజయవాడ’ పై నిర్బంధం

● ఆశాల ముందస్తు అరెస్టులు.. గృహ నిర్బంధాలు

పెనమలూరు : ఆశ వర్కర్లను, సిఐటియు నాయకులను అర్ధరాత్రి 12 గంటలకు ఇళ్లకు పోలీసుల వచ్చి నోటీసులు ఇచ్చి హౌస్ అరెస్ట్ చేయడం దుర్మార్గమని పెనమలూరు మండలం సిఐటియు కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 8వ తారీకు ఆశా వర్కర్ల చలో విజయవాడ కార్యక్రమం ఉన్న నేపథ్యంలో నోటీసులు జారీ చేయడం ప్రభుత్వం పిరికితనానికి నిదర్శనం అని విమర్శించారు. పెనమలూరు మండలం సిఐటియు ఉపాధ్యక్షులు ఎస్కె మస్తాన్వలి, పెనమలూరు మండలం ఆశ వర్కర్, సిఐటియు నాయకురాలు బేతపూడి అంజలి., పెనమలూరు మండలం ఆశ వర్కర్స్ సిఐటియు నాయకురాలు సిరిగిరి సుజాత, సత్యవతి పెనమలూరు మండలం ఆశ వర్కర్స్ నాయకురాలు కోన శివ నాగమణితోపాటు పలువురు ఆశా వర్కర్లకు నోటీసులు జారీ చేశారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** ఆశ, సిఐటియు యూనియన్ నాయకులను హౌస్ అరెస్టు చేయటం దుర్మార్గపు చర్య అని కంకిపాడు మండల కార్యదర్శి తాడంకి నరేష్ అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించకుండా ఈ ప్రభుత్వం నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరని అన్నారు. ఆశాల న్యాయమైన సమస్యలు తీరేవరకు ప్రభు త్వం ఎన్ని అడ్డంకులు సష్టించినా ఉద్యమాన్ని ఆపబోమన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ :** పోలీసులతో ముందస్తు నోటీసులు ఇచ్చి ఆశాల ఉద్యమాలను నిర్బంధించలేరని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ సి పి రెడ్డి హెచ్చరించారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ముందస్తు నోటీసులు పోలీసులు ఇవ్వడం, పోలీసులను ఇళ్ల వద్ద కాపలా పెట్టడం ద్వారా ఉద్యమాలను గాని హక్కులను గాని హరించడమేనని తెలిపారు. ఐద్వా పట్టణ కార్యదర్శి పి రజిని పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల ధర్నాను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నేడు అనగా గురువారం విజయవాడలో జరిగే ధర్నా కార్యక్రమానికి కృష్ణాజిల్లాలో ఉన్న ఆశావర్కలందరు పాల్గొని విజయవంతం చేయాలని ఎపి ఆశ వర్కర్స్ యూనియన్ కష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి పరుచూరి ధనశ్రీ పిలుపు నిచ్చారు. ఆశా కార్యకర్తలు ధర్నాకు వెళ్ళనివ్వకుండా ఇళ్ల దగ్గరికి ,డ్యూటీ చేసే దగ్గరికి వెళ్లి ముందస్తు నోటీసులు ఇవ్వడం బెదిరించడం ఇల్లు దగ్గర హౌస్ అరెస్ట్ చేయడం చాలా దుర్మార్గం అన్నారు. సమస్యల్ని పరిష్కరించవలసిన ప్రభుత్వాలు పరిష్కరించక పోగా నిర్బంధాలతో ఉద్యమాలను ఆపాలని ప్రయత్నం చేయటం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనం అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని లేనిపక్షంలో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

యనమలకుదురులో ఆశలకు నోటీసులు ఇస్తున్న దృశ్యం

కంకిపాడులో...

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం : కొడాలి

ప్రజాశక్తి - గుడివాడ (నందివాడ) : నందివాడ మండలం పెదలింగాల గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్ర భవనాలను ఎమ్మెల్యే కొడాలి నాని మహిళ ప్రజా ప్రతినిధుల చేత బుధవారం ప్రారంభోత్సవం చేయించారు. తొలుత గ్రామ పొలిమేరలో ఎమ్మెల్యే నానికు వైఎస్ఆర్సిపి శ్రేణులు, ప్రజానీకం గజమాలలతో ఘన స్వాగతం పలికారు. శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో పూజా కార్యక్రమాలు నిర్వహించిన ఎమ్మెల్యే నాని, పార్టీ నేతలతో కలిసి వైసిపి జెండాను ఎగురవేసి ర్యాలీగా గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే కొడాలి నాని మాట్లాడుతూ నందివాడ మండలంలో దశాబ్దాల తాగునీటి సమస్యకు సీఎం జగన్ సహకారంతో శాశ్వత పరిష్కారం చూపించా మన్నారు. 110 ఎకరాల తాగునీటి చెరువు, రెండు మండలాల్లో మూడు, మూడు చొప్పున ఆరు హెడ్ వాటర్ ట్యాంకుల నిర్మాణానికి సీఎం జగన్ 210 కోట్ల నిధులను ఇప్పటికే మంజూరు చేశారని తెలియజేశారు. అనంతరం ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి ఉచితంగా స్థలాన్ని అందించిన దేవంబొట్ల వెంకట బ్రహ్మాజీని ఎమ్మెల్యే నాని సన్మానించారు. వైసిపి రాష్ట్ర నాయకులు దుక్కిపాటి శశి భూషణ్, ఎంపీపీ పేయ్యల ఆదాం, జడ్పిటిసి కందుల దుర్గా కుమారి, వైస్ ఎంపీపీ పూడి సుధాకర్, గుడివాడ మార్కెట్ యార్డ్ చైర్మన్ మట్టా నాగమణి జాన్ విక్టర్, సర్పంచ్ కలపాల సుధారాణి, ఎంపీటీసీ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు కొడాలి మూర్తి

● సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై. నరసింహారావు

ప్రజాశక్తి-గన్నవరం : పార్టీ ఎడల అచెంచలమైన విశ్వాసంతో జీవితమంతా ఎర్రజెండా నీడన కొనసాగిన మూర్తి ధన్యుడని సిపిఎం జిల్లా కార్యదర్శి వై. నరసింహారావు అన్నారు. స్థానిక రామ్ నగర్లో సిపిఎం నాయకులు కొడాలి మూర్తి సంస్మరణ సభ బుధవారం జరిగింది. నరసింహారావు మాట్లాడుతూ.. దేశంలో రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితులు, అధికార పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను విశదీకరించారు. ఈ పాలకులకు వ్యతిరేకంగా రానున్న ఎన్నికల్లో పనిచేయాలని పార్టీ కార్యకర్తలకు నాయకులకు సూచించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని మంచి మనిషిగా గుర్తింపు పొందిన మూర్తి ఆశయాలు సాధనకు కషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ అధ్యాపకులు గన్నె వెంకట్రావు, డాక్టర్ మద్దుకూరి విజయ కుమార్, సిపిఎం మండల నాయకులు అనుమోలు వెంకటేశ్వరరావు, గ్రామ నాయకులు గుండిమెడ ఉదయ భాస్కరరావు, పఠాన్ సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నరసింహారావు

పిహెచ్‌సిల్లో మెరుగైన సేవలందించాలి

● డిఎంహెచ్ఒ జి.గీతాబాయి

ప్రజాశక్తి-ఉయ్యూరు : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్యసేవలందించి రోగుల పట్ల మర్యాదగా మసలుకోవాలని డీఎంహెచ్ఒ జి. గీతాబాయి సూచించారు. కాటూరు ప్రాథమిక ఆరోగ్య కేం ద్రాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా సిబ్బంది హాజరు, ఇతర రికార్డులను తనిఖీచేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసూతిల సంఖ్య పెంచాలని, గర్భిణిలు, పిల్లల నమోదు పక్కాగా చేయాలన్నారు. ఆరోగ్య కేంద్రాని వచ్చే రోగులకు తగిన వైద్యపరీక్షలు చేసి మందులు అందజేయాలన్నారు. అలాగే జాతీయ నులిపురుగుల నివారణ దినం పురస్కరించుకుని పిల్లలకు శుక్రవారం నులి పురుగుల మందులు వేయాలన్నారు. ప్రతిపాఠశాలను సందర్శించి మందులు సక్రమంగా పంపిణీ జరిగేలా చూడాలన్నారు. ఆరోగ్యకేంద్రం అధికారి ఎస్ శివరామకష్ణ, ఆరోగ్య విస్తరణ అధికారి పి నాగార్జున వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బంది రాకుండా చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి పెడన : రానున్న వేసవిని దష్టిలో ఉంచుకొని సముద్ర తీర ప్రాంత మండలాలైన బంటుమిల్లి, కత్తివెన్ను గ్రామాలలో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా ఉండేందుకు ముందస్తు ప్రణాళికలతో సమర్థవంతంగా నీటి సరఫరాను అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు కష్ణాజిల్లా కలెక్టర్ పి. రాజాబాబు పేర్కొన్నారు. బుధవారం ఆయన వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ఆ సమస్యను నివారించేందుకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను సక్రమంగా నింపుతున్నారా లేదా అని, పంట కాలువలు, ఫిల్టర్ బెడ్లు స్థితిగతులు క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు బంటుమిల్లి, కత్తివెన్ను మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన బంటుమిల్లి మండలం మల్లేశ్వరం గ్రామంలో ఉన్న 16 ఎకరాల మంచినీటి సమ్మర్ స్టోరేజ్ చెరువు, ఫిల్టర్ బెడ్లను , కత్తివెన్ను మండలం, పల్లెపాలెం గ్రామం ఉన్న 30 ఎకరాల మంచినీటి సమ్మర్ స్టోరేజ్ చెరువును, సీతనపల్లి గ్రామంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, ఫిల్టర్ బెడ్ ను, అలాగే బంటుమిల్లి కాలువను పరిశీలిం చారు. మంచినీటి సమస్య గూర్చి స్థానిక నాయకులు, ప్రజలను నేరుగా జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అడిగి పలు విషయాలు తెలుసుకొన్నారు. అలాగే సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ల వద్ద ఫిల్టర్ బెడ్లు అన్నీ పాడై పోవడంతో కలుషిత నీరు సరఫరా కాబడుతున్నట్లు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఉప్పాల హారికా, పెడన నియోజకవర్గ సమన్వయకర్త ఉప్పాల రాము తన దష్టికి ఈ సమస్యలు తీసుకు వచ్చారని, దీంతో తానె స్వయంగా పరిశీలించేందుకు వచ్చినట్లు కలెక్టర్ వివరించారు. రెండు మండలాల్లో 80 శాతం వరకు చెరువులు తాగునీటితో నింపామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పి సిఈఓ జ్యోతిబసు, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ ఈ వెంకటరమణ, ఇరిగేషన్ ఎస్ఈ ప్రసాద్, బంటుమిల్లి జడ్పిటీసీ మలిశెట్టి వెంకటరమణ, ఎంపిపి వెలవెల చినబాబు, కత్తివెన్ను జడ్పిటీసీ మైలా రత్నకుమారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

మార్చి 18 నుండి టెన్త్ పరీక్షలు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పదవ తరగతి (ఎస్ఎస్సి) పరీక్షలు వచ్చే మార్చి నెల 18వ తేదీ నుండి 30వ తేదీ వరకు ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:45 గంటల వరకు జిల్లాలో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి తహేరా సుల్తానా ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో 151 ఎస్ఎస్సి పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని డిఇఓ తెలిపారు.

సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలి : డిఇ

ప్రజాశక్తి-పెడన : రామరాజుపాలెం ఛానల్ నుంచి సాగునీటిని పూర్తిస్థాయిలో విడుదల చేస్తున్నామని వీటిని అందరు సద్వినియోగం చేసుకోవాలని నీటిపారుదల శాఖ డి ఈ మురళి పేర్కొన్నారు. బుధవారం స్థానిక నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది, క్లస్టర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ రానున్న వేసవి దష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే రామరాజుపాలెం ఛానల్ నుంచి సాగునీరు పూర్తిస్థాయిలో విడుదల చేస్తున్నామన్నారు. ఆయా గ్రామాల్లోని పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు అలాగే పంటలైన మినుము, వేరుశనగ పంటల రైతులు ఈ నీటిని వినియోగం చేసుకోవచ్చన్నారు. బడాబాబులు రొయ్యల, చేపల చెరువులకు ఈ నీరు మళ్లించకుండా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ముఖ్యంగా గ్రామ పంచాయతీలోని మంచినీటి చెరువుల కోసం ఈ నీటిని అధిక శాతం విడుదల చేస్తున్నామని ఎక్కడైనా రైతులకు ఇబ్బందులు కలిగితే సంబంధిత కస్టర్లుతో ముందుగానే సూచించాలని చెప్పారు.

పూర్ణచంద్రరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దశ్యం

పూర్ణచంద్రరావు చిత్రపటం ఆవిష్కరణ

ప్రజాశక్తి-అవనిగడ్డ : నాగాయలంక గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ సైకం పూర్ణచంద్రరావు చిత్రపటాన్ని పంచాయతీ సమావేశ మందిరంలో బుధవారం దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్ణచంద్రరావు 1995 నుంచి 2000 వరకు సర్పంచ్గా గ్రామ అభివద్ధికి నిస్వార్థంగా సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉపసర్పంచ్ తలసిల వెంకట నరసింహారావు(నాని) మాట్లాడుతూ గ్రామానికి సర్పంచులుగా గ్రామ అభివద్ధికి కషి చేసిన వారి సేవలను మరువరాదన్నారు. ఈ కార్యక్రమంలో నాగాయలంక ఎంపీటీసీ సభ్యులు లంకే శ్రీనివాస్, ప్రసాద్, నాగిడి ఆదిలక్ష్మి, బీసీ మత్స్యకారుల సంఘాల నాయకులు నాగాంజనేయులు, తిరుమల శెట్టి మస్తాన్రావు, కన్నా రాజు, మోకా నాగ ప్రసాద్ పాల్గొన్నారు

అనుచరులతో డాక్టర్ చంద్రశేఖర్ సమావేశం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిగా మాజీ మంత్రి సింహాద్రి సత్యనారాయణరావు తనయుడు, ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు పేరును పార్టీ అధిష్టానం ప్రకటించగా ఆయన తన వయసు రీత్యా తనయుడు రామ్ చరణ్ పేరును ప్రకటించారు. దీనితో వైసిపి కార్యకర్తలలో గందరగోళం ఏర్పడగా బుధవారం డాక్టర్ చంద్రశేఖర్ అవనిగడ్డలోని ఆయన స్వగహానికి విచ్చేశారు. ఈ సందర్భంగా పలువురు అభిమానులు అనుచరులు వైసిపి నాయకులతో సమావేశమై చర్చించినట్లు తెలిసింది. అయితే ఆయన పోటీ చేస్తారా లేక ఆయన తనయుడిని పోటీ చేయిస్తారా అనేది స్పష్టత లేదు.

మొదటిపేజీ తరువాయి

పట్టని ఎ.కొండూరు తాగునీటి సమస్య

గుణదల ఫ్లైఓవర్

కూడా లేదు. గుణదల నుంచి నున్న వరకు 1.2 కిలోమీటర్ల పొడవున రూ.36 కోట్లతో గుణదల వంతెన నిర్మించాలని పనులు మొదలుపెట్టినా ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ప్రస్తుతం ఉన్న ధరల ప్రకారం రూ.62 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేసిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపారు. కానీ అతీగతీ లేదు. ఎ.కొండూరు మండలంలోని 15 తాండాల్లో గిరిజనులు దీర్ఘ కాలిక కిడ్నీ వ్యాధులతో సతమతమవుతున్నారు. వీరికి శాశ్వత ప్రాతిపదికన పైపులైన్ల ద్వారా కృష్ణా నీటిని తాగునీరుగా అందించాలని ప్రాజెక్టును రూపొందించారు. రూ.36 కోట్ల అంచనా వ్యయంతో కూడిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, అధికారులతో పాటు, ఆర్థిక శాఖ అధికారులను కలిసి ఈ ప్రాజెక్టు నిధులను మంజూరు చేయాలని జిల్లా అధికారులు కోరారు. కానీ స్పందన కరువైంది. అంతేకాకుండా కృష్ణా నది పక్కనే ఉన్నా ప్రధాన కాలువలు సమీపం నుంచే ప్రవహిస్తున్నా రైతులు అధిక శాతం వర్షాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఈ సమస్య పరిష్కారానికి సమగ్రమైన ప్రణాళికలు రూపొందించడం కానీ నిధులు కేటాయించడం కానీ లేదు. గత ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 14 మండలాలను కరువు మండలాలుగా గుర్తించి ఆదుకోవాలని జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి నివేదించింది. ఈ ప్రస్తావన కూడా కరువైంది.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు కట్టుదిట్టం

పాయింట్ల నుంచి బందోబస్తు ఏర్పాటు, భద్రతా చర్యలు, సీసీ కెమెరాల నిఘా విషయంలో పోలీసు శాఖతో సమన్వయం చేసుకోవాలన్నారు. సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లకు సంబంధించి ఐదేసి చొప్పున బృందాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. విద్యార్థులు హాల్ టికెట్‌తో ఉచితంగా ఆర్‌టిసిలో ప్రయాణించేలా చూడాలని సూచించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీరు, విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, ప్రాథమిక చికిత్స కిట్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐఈవో) సీఎస్ఎస్ఎన్ రెడ్డి, డీఎస్ఈవో యూవీ సుబ్బారావు, డా.ఆర్.బాలాజీనాయక్, ఏపీఎస్ఆర్టీసీ ప్రతినిధి ఎంవై దానం, ఏఎస్‌పీవో ఎం.సత్యనారాయణ, ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ ఎం.మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సాయుధ దళాలకు రూ.2 లక్షల విరాళం

ప్రజాశక్తి - విజయవాడ : సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్ రూ.2 లక్షల విరాళం అందజేసింది. ఈ మేరకు బ్యాంకు ప్రతినిధులు బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ఎస్. డిల్లీరావు చేతుల మీదుగా విరాళానికి సంబంధించిన మెగా చెక్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎస్.డిల్లీరావు కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్ వారిని అభినందించారు. సాయుధ దళాల పతాక దినోత్సవ నిధి-2022 కార్యక్రమం ద్వారా రూ.41.22 లక్షలను సమకూర్చి రాష్ట్రంలోనే కాకుండా దక్షిణ భారతదేశంలోనే ఎన్‌టిఆర్ జిల్లా అగ్రస్థానంలో నిలిచిందన్నారు. భవిష్యత్తులోనూ జిల్లాను ఇదే విధంగా ముందు వరుసలో నిలపాలని ఆయన ఆకాక్షించారు. ఈకార్యక్రమంలో కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్ చీఫ్ క్రెడిట్ ఆఫీసర్ వై.సత్యనారాయణ ప్రసాద్, ఏజీఎం ఎ.మదన్ మోహన్, విజయవాడ క్లస్టర్ హెడ్ జె.హరిప్రసాద్, జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయ సూపరింటెండెంట్ వై.ఈశ్వర్‌రావు పాల్గొన్నారు.

చిన్నారులను నులి పురుగుల నుండి కాపాడుకుందాం

ప్రజాశక్తి - విజయవాడ : జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా పిల్లలందరిలో నులిపురుగులు వల్ల జరిగే నష్టాల గురించి అవగాహన కలిగిస్తూ, నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు ఒకటి నుండి 19 సంవత్సరాలు కలిగిన ప్రతి ఒక్క విద్యార్థికి ఈనెల 9న ఖచ్చితంగా చేరేటట్టు చూడాల్సిన బాధ్యత పాఠశాలల యాజమాన్యాలదేనని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. విజయవాడ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం కొత్త భవనంలోని మీటింగ్ హాల్లో బుధవారం ఆయన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ (జనరల్) కె. శకుంతల, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, ఎంఈవోలు, స్కూల్ సూపర్వైజర్లు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల వారు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రివర్‌ఫ్రంట్ పార్క్ నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - విజయవాడ : రివర్ ఫ్రంట్ ప్లాజా పార్క్‌లో ప్రజలకు మరింత ఆనందాన్ని కల్పించే హోమ్ థియేటర్ను ఫన్ సిట్టింగ్ ఏరియాలో నిర్మించాలని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన రివర్ ఫ్రంట్ బ్యూటిఫికేషన్ పార్కు పనులను పరిశీలించారు. దీని నిర్మాణ పనులను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం

జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు ఆదేశం

ప్రజాశక్తి-విజయవాడ : నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల పథకం కింద లబ్ధిదారుల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఐజీఎంసీ స్టేడియం కాంప్లెక్స్‌లోని వార్డు సచివాలయం-89ను ఆకస్మికంగా సందర్శించారు. వార్డు సచివాలయం ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. ముఖ్యంగా నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల పథకం కింద లబ్ధిదారుల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ఆరా తీశారు. ఇప్పటి వరకు జరిగిన, ప్రస్తుతం జరుగుతున్న రిజిస్ట్రేషన్ల నివేదికలను పరిశీలించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సజావుగా సాగేలా చూడాలని ఆదేశించారు. లబ్ధిదారులకు సరైన సమాచారం అందించి రిజిస్ట్రేషన్లు జరిగేలా చూడాలని వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ పి.మనోహర్, వీఆర్వో ఎం.త్రివేణిలకు స్పష్టం చేశారు. సచివాలయం పరిధిలో సిబ్బంది సమన్వయంతో వ్యవహరిస్తూ లక్ష్యాలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్లు జరిగేలా చూడాలన్నారు.

CHANGE OF NAME

I, JAYARAMAREDDY KRISHNA REDDY (Old Name), S/o Jayarama Reddy, R/o Flat No 204, Sri Sathya Sai Towers, B-Block, Nunna Main Road, Nunna, Krishna, Vijayawada-521212, I have changed my name as **GODUGU KRISHNA REDDY (New Name),** Hereafter my name is know as **GODUGU KRISHNA REDDY (New Name).**

NAME CHANGE

I,Shettipalli Krishna Reddy S/o Shettipalli Roshireddy R/o D.No. 4-78/2, Reddy Bazar, Tholukodu Road , Mylavaram Mandal, NTR dt. A.P India. have changed my sur name from SHETTIPALLI KRISHNA REDDY to SETTIPALLI KRISHNA REDDY S/O SETTIPALLI ROSI REDDY an vide affidavit dated 06-02-2024 before Notary.

IN THE COURT OF HON"BLE XIV ADDITIONAL DISTRICT AND SESSIONS JUDGE, VIJAYAWADA
F.C.O.P.No.665/2023

Between:-
Kotari Bhaskar Rao ...Petitioner
And
Kotari Charishma @ Ganeshula Charishma ...Respondent

పై నంబరు F.C.O.P ను రెస్పాండెంట్ నుండి విడాకులు కోరుచూ కోర్టులో దాఖలు చేసుకొని ఉన్నాను. సదరు రెస్పాండెంటుకు ఎన్నిసార్లు సమన్లు పంపియున్ననూ తీసుకోని కారణంగా కోర్టు వారు ఈ Publication ను Order చేయుచూ ది. 26-02-2024 తేదీన ఉ॥ 10-30 ని॥లకు రెస్పాండెంట్ హాజరు అయ్యి ఆక్షేపణ ఉన్న యెడల తెలుపుకొన వలెను. లేని యెడల మీ పరోక్షమున ఈ పిటీషను తీర్మానించబడునని తెలియచేయడమైనది.

ఇట్లు
కోతారి భాస్కరరావు,
రామవరప్పాడు, విజయవాడ రూరల్.

ప్రకటన
మహారాజశ్రీ రెండవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జివారి కోర్టు, విజయవాడ.
OS No.8/2019

Between:
ఓరుగంటి రవీంద్రబాబు ...వాది
మరియు
ఉప్పలపాటి రాధిక ...ప్రతివాది
టు,
ఉప్పలపాటి రాధిక, భర్త రత్నశేఖర్, హిందువు, వయస్సు 28 సం॥లు, రెసిడెన్సీ డోర్.నెం.6-131, 2వ లైను, చలసాని నగర్, కానూరు, పెనమలూరు మండలం, కృష్ణా జిల్లా.

పై నెంబరు దావాలో శ్రీ కోర్టువారి ఆర్డరు ప్రకారం ప్రతివాది హాజరు నిమిత్తం ది.26-02-2024వ తేదిన వాయిదా వేసినారు. కనుక పై కోర్టులో, పై తేదిన ప్రతివాది ఉదయం 10-30 గం॥లకు స్వయముగా గాని లేక న్యాయవాది ద్వారా గాని ఏమైన ఆక్షేపణలు ఉన్నఏడల తెలుపుకోవలెను. లేని ఏడల మీ పరోక్షమున ఈ దావా తీర్మానించబడును.

కోర్టు ఉత్తర్వుల ప్రకారం
వాయిదా:26-02-2024
విజయవాడ,
తేది:30-01-2024

ఇట్లు
T.Bhirraju,
Advocate,
Satyanarayanapuram,
Vijayawada-11,
Cell No.9705353284

Notice Under Rule 22
IN THE COURT OF THE II ADDITIONAL DISTRICT JUDGE: VIJAYAWADA
E.P.No.3/2020 in OS.No.296/2010

Between:
M/s Sha Jayanthilal Prakashmal & 3 others ...D.H.R's/Plaintiff
And
G.Bhaskar Rao ...J.D.R/Defendant.

J.D.R/Defendant:
G.Bhaskar Rao, S/o G.Papa Rao, D.No.43-124-17, Ajit Singh Nagar, Vijayawada.

Take Notice that the above E.P is posted to Dt:22-02-2024 and you are hereby inform to appear before the Hon'ble court on Dt:22-02-2024 at 10-30 A.M either in person or through an Advocate, if you fail to attend the Hon'ble court on that day the said E.P will be disposed exparte against you.

(By Order of the Hon'ble Court)
Ch.Damodara Rao,
Advocate for D.H.R/Plaintiffs,
Cell.No.9393999545

గ్రామపంచాయతీ కార్యాలయం, వణుకూరు

ఆర్.ఓ.సి. నెం. 01/2024 **తేది : 06-02-2024**

టెండరు నోటీసు

కృష్ణాజిల్లా, పెనమలూరు మండలం, వణుకూరు గ్రామపంచాయతీ నందు ఈ దిగువ చూపిన షెడ్యూలు ద్వారా పనులు నిర్వహణ 2024-25 సం॥నకు కాంట్రాక్టు ఏజెన్సీ ద్వారా సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. సదరు టెండర్లను ది.17-02-2024వ తేదీ శనివారం ఉదయం 10 గం.ల నుండి మధ్యాహ్నం 12 గం.ల వరకు స్వీకరించబడును. అదేరోజు 3 గంటల వరకు హాజరైన టెండరుదార్లు సమక్షంలో తెరువబడును. సదరు టెండర్లు నందు పాల్గొనువారు నిర్ణీత ధరావత్తు చెల్లించి దాఖలు చేయవలెను. ఇతర షరతులు వివరములు పంచాయతీ కార్యాలయము పనివేళలలో తెలుసుకొనగలరు.

షెడ్యూలు

వ.నెం.	వివరములు	కావల్సిన సిబ్బంది	ధరావత్తు
1,	2024-25 సం॥నకు 1. ప్రజారోగ్య నిర్వహణ ఎ) పారిశుధ్య కార్మికులు-15 బి) ట్రాక్టర్ డ్రైవర్-1	16 మంది	5,000/-
2.	వీధి లైట్లు నిర్వహణ ఎ) ఎలక్ట్రీషియన్-1 బి) హెల్పర్ -1	2 మంది	
3.	మంచినీటి సరఫరా ఎ) ఫిట్టర్-1 బి) ట్యాంక్ ఆపరేటర్లు-2	3 మంది	
	మొత్తము	21	5,000/-

గమనిక : 1) నిధుల లభ్యతను బట్టి చెల్లింపులు జరుపబడును.
2) అనుభవము కలవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సం/- కె.లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శి,
వణుకూరు గ్రామపంచాయతీ,
పెనమలూరు మండలం, కృష్ణాజిల్లా.

ప్రకటన
మహారాజశ్రీ 14 వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జివారి కోర్టు, విజయవాడ.
GWOP No.103/2023

Between:
1) కోట సత్య కావేరి
2) గుండిమెడ శోభన్ బాబు ...పిటీషనర్స్
మరియు
నిల్ ...రెస్పాండెంట్

పై నెంబరు పిటీషన్ నందు 1, 2 వ పిటీషనర్లు వారి యొక్క దత్తపుత్రుడు గుండిమెడ జాగృత్ కి 1 వ పిటిషనర్ ను గార్డియన్ గా అపాయింట్ చేయుటకు పై పిటీషన్ దాఖలు చేసి ఉన్నారు. పైన తెలిపిన పిటీషన్ నందు శ్రీ కోర్టువారు సదరు గుండిమెడ జాగృత్ కి 1వ పిటిషనర్ ను గార్డియన్ గా అపాయింట్ చేయుటకు ఎవరికైనను, ఎటువంటి ఆక్షేపణలు ఉన్నఏడల ది. 28-02-2024 వ తేదికి పైన తెలిపిన శ్రీ కోర్టు వారి ముందు ఉదయం 10-30 గం॥లకు మీరు గాని లేక న్యాయవాది ద్వారా గాని హాజరు అయి ఏమైన ఆక్షేపణలు ఉన్నఏడల తెలుపగలను. లేని యెడల మీ పరోక్షమున ఈ పిటిషన్ తీర్మానించడమైనది.
వాయిదా:28-02-2024

ఇట్లు
V.Suresh,
Advocate,
Krishnalanka,
Vijayawada-113.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT TIRUVURU
GO No 31/2023 IN OS NO 137/2016

బిట్వీన్:
కఠారి ఏడుకొండలు .... డిహెచ్ఆర్
మరియు
రామాల బిందు .... జెడిఆర్
టు:
రామాల బిందు వైఫ్ ఆఫ్ (లేటు) ప్రకాశరావు, గృహిణి, హిందు, వయస్సు 35 సం:లు
R/o కంభంపాడు (V&P)
ఏ.కొండూరు మండలం, ఎన్టీఆర్ జిల్లా.

పై నెంబరు ఇపి నెం.31/2023 లో జెడిఆర్ అయిన మీకు నోటీసు నిమిత్తం ది.29-02-2024వ తేదీన వాయిదా అయివున్నది. కావున మీరు ది. 29-02-2024వ తేదీన ఉదయం 10.30 గంటలకు స్వయంగా కానీ లేక వకీలు గారి ద్వారా గానీ పై తెలిపిన కోర్టు వారి ఎదుట హాజరు కావలసినదిగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేదీ: 29-02-2024
తిరువూరు
ది.07-02-2024.

చింతల వెంకటరెడ్డి
అడ్వకేట్,
తిరువూరు
సెల్. 94407 64148

SUIT SUMMONS
IN THE COURT OF II ADDL.JUNIOR CIVIL JUDGE: VIJAYAWADA
O.S 1010/2020

Between:
State Bank of India, RACPC-1, Benz circle Vijayawada, Rep by its Chief Manager ...Plaintiff
And
Thodeti Vijaya Vasu son of Venkataratnam, Police Constable, Employee No.2737, R/o. D.No.9-135, Ramanagaram Village, Challapalli Mandalam, now R/o.1-293, Near Tirupatamma Temple, Kanuru, Vijayawada-7 ...Defendant

The Defendant to take summons in the above Suit filed against you by the Plaintiff for recovery of suit claim taken from Bank of Rs.1,51,560/- under the loan account No.35750794306. The said suit stands posted to 20-02-2024 for your appearance, at 10-30 A.M., before this Hon'ble Court on that day. Else next step follows.

//By Order//
T.V.N.Vasudeva Rao,
Advocate for Plaintiff.

నూతన ఔషధాల రూపకల్పన అవసరం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక వివి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సస్ కళాశాలలో ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ గుడ్లవల్లేరు శాఖ వారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ సదస్సును బుధవారం నిర్వహించిన్నట్లు కన్వీనర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ లక్ష్మణరావు తెలిపారు. ఈ సదస్సు 'నరాల క్షీణత రుగ్మతలకు అందించే చికిత్స పద్ధతులలో కత్రిమ మేధస్సు ముఖ్య పాత్ర, ఆరోగ్య సంరక్షణలో జిన్సెంగ్ ప్రభావం' అనే అంశం పై నిర్వహించామన్నారు. ఈ సదస్సుకు రిసోర్స్ పర్సన్సగా డాక్టర్ కె. సుశ్రుత ప్రొఫెసర్, కాలేజ్ ఆఫ్ బయో మెడికల్ అండ్ హెల్త్ సైన్సెస్, కొంకర్ విశ్వవిద్యాలయం, దక్షిణ కొరియా నుండి మరియు డాక్టర్ కె.స్పందన రాజేంద్ర అసిస్టెంట్ ప్రొఫెసర్, బయోటెక్నాలజీ విభాగం, కాలేజ్ ఆఫ్ లైఫ్ సైన్సెస్, సూజింగ్ విశ్వవిద్యాలయం, దక్షిణ కొరియా నుంచి విచ్చేసారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సదస్సులో డాక్టర్ సుశ్రుత మాట్లాడుతూ కృత్రిమ మేధస్సులో నరాల క్షీణత రుగ్మతలకు చికిత్సను అందించే విధానాలపై, మెదడు పై దుష్ప్రభావాలు చూపే ఎన్నో వ్యాధులు ఈ కాలంలో ప్రబలుతున్నాయని వాటికి నూతన ఔషధాలను రూపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సదస్సులో కన్వీనర్ డా.ఎ. లక్ష్మణ్ రావు, కో-ఆర్డినేటర్స్ డా. ఎస్ కె అమీనా బీ, హెచ్ ఓ డి ఫార్మకాలజీ విభాగం, డా. పి. రవీష, హెచ్ ఓ డి ఫార్మకాగ్నొసి విభాగం, అధ్యాపకులు డా. టి. ప్రశాంతి పాల్గొన్నారు.

బహుమతులు అందజేత

ప్రజాశక్తి-గన్నవరం : విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలోనూ రాణించాలని జిల్లా పరిషత్ సభ్యురాలు ఎలిజబెత్ రాణి అన్నారు. చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ - సి ఆర్ ఏ ఎఫ్ ఆధ్వర్యంలో ముస్తాబద నవభారత హైస్కూల్ లో బుధవారం బాల మేళ కార్యక్రమం జరిగింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు నవభారత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. విజేతలకు ప్రథమ ద్వితీయ తతీయ స్థానాలతో పాటుగా కన్సోలేషన్ బహుమతులు అంద జేశారు. నవభారత్ హై స్కూల్ ప్రిన్సిపల్ షేక్ ఇమామ్, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ నానారావు, పాఠశాల కరస్పాండెంట్ షేక్ జాకీర సుల్తానా పాల్గొన్నారు.

సిఐకి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన కెవిఎస్.వరప్రసాద్ ని కష్ణాజిల్లా వైఎస్ఆర్సిపి ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఖోఖో క్రీడాకారులకు అభినందన

ప్రజాశక్తి-గన్నవరం : ఆడుదాం ఆంధ్రా ఖో ఖో క్రీడలో అసమాన క్రీడా నైపుణ్యం ప్రదర్శించి జిల్లా స్థాయి పోటీలలో తతీయ స్థానం సాధించిన గన్నవరం నియోజక వర్గం పురుషుల జట్టును గన్నవరం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో గన్నవరం మండల అధ్యక్షులు అనగాని రవి, మాజీ మండల ఉపాధ్యక్షులు గొంది పరంధామయ్య, యంపిడిఓ సత్య కుమార్‌లు అభినందించారు. భవిష్యత్‌లో కూడా ఇదే ఇదే ఉత్సాహం తో సాధన చేసి ఉత్తమ క్రీడాకారులు గా రాణించాలని రవి, పరంధామయ్య, సత్య కుమార్ లు కోరారు. క్రీడాకారుల తో పాటు ఉత్తమ శిక్షణ ఇచ్చి ప్రోత్సహించిన గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల వ్యాయామ విద్య ఉపాధ్యాయులు షేక్

క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

మీరా సాహెబ్‌ను ప్రశంసించారు. ఈఓపిఆర్.డి వెంకటేశ్వరమ్మ, కే. వి.ఆర్. కిషోర్, కార్యదర్శి అనిల్ కుమార్, గన్నవరం నియోజకవర్గం క్రీడా సమన్వయ కర్త ధనియాల నాగరాజు, బాపులపాడు మండల సమన్వయ కర్త పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సీతారావమ్మ మృతి తీరనిలోటు : టిడిపి

ప్రజాశక్తి హనుమాన్‌జంక్షన్ : టీడీపీ గ్రామకమిటీ కార్యదర్శి పల్లగాని వెంకట నాగేశ్వరరావు తల్లి సీతారావమ్మ (91) వద్ధాప్యకారణాలతో బుధవారం మతి చెందారు. బాపులపాడు మండలం సింగన్నగూడెంలో పల్లగాని సీతారావమ్మ, సూర్యనారాయణ కుటుంబ సభ్యులు టీడీపీ ఆవిర్భావం నుండి సేవలందించడంతో పాటు 16 సంవత్సరాలు పంచాయితీ పాలకవర్గ సభ్యురాలిగా గ్రామాభివద్ధికి చేసిన కషి నిరుపమానమని ఆళ్ల కొనియాడారు. సీతారావమ్మకు భర్త సూర్య నారాయణ, ఏడుగురు కుమారుల్లో ఒక కుమారుడు నాగేశ్వరరావు టీడీపీ కార్యదర్శిగా సేవలం దిస్తుండగా మనుమడు పల్లగాని వీరాంజనేయులు పంచాయితీ పాలకవర్గ సభ్యునిగా సేవలం దిస్తున్నారు. సీతారావమ్మ భౌతికకాయానికి మండల కార్యదర్శి పుట్టా సురేష్, ఎంపీటీసీ పుసులూరి లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్ బెజవాడ వెంకట కష్ణారావు, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు 'మొవ్వా వేణుగోపాల్ నివాళులర్పించారు.

ఆడుదాం ఆంధ్ర రాష్ట్ర ఇంచార్జ్‌గా నాగరాజు

ప్రజాశక్తి-గన్నవరం : ఈ నెల 9 నుండి 13వరకు విశాఖపట్నం లో జరుగబోవు ఆడుదాం ఆంధ్రా క్రీడల ఇంచార్జ్‌గా గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల వ్యాయామ విద్య ఉపాధ్యాయులు, గన్నవరం నియోజక వర్గం ఇంచార్జ్ ధనియాల నాగరాజును నియమిస్తూ కష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ పతాంజలి ఉత్తర్వులు ఇచ్చారు. జిల్లా నుండి 106మంది క్రీడాకారులు కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్, షటిల్ బాడ్మింటన్, క్రికెట్ క్రీడాంశా లనుండి పాల్గొంటున్నారు. జాయింట్ కలెక్టర్ పతాంజలి ఆధ్వర్యంలో జిల్లా క్రీడల అభివద్ధి అధికారిణి ఝాన్సీ లక్ష్మి క్రీడాకారుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి మచిలీపట్నం నుండి క్రీడాకారులు విశాఖపట్నం బయలు దేరారు.జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ శిక్షకులు కల్యాణి,రమణ, అశోక్,ముకుందలు పోటీలకు ప్రతినిధులుగా బయలు దేరారు.

సంతోష్‌కు పలువురి అభినందనలు

ప్రజాశక్తి-గుడివాడ : ఇటివల గుంటూరులోని నేషనల్ లెవెల్ యూత్ ఫెస్టివల్ విజ్ఞాన్ మహోత్సవంలో ఆన్లైన్ ఫోటోగ్రఫీ నేషనల్ కాంపిటేషన్ పోటీలలో ప్రథమ బహుమతి అందుకున్న గుడివాడ యువకుడు అమర్తల సంతోష్ పలువురు బుధవారం అభినందిచారు. స్థానిక బాపూజీ నగర్‌కు చెందిన అమర్తల సంతోష్ నంలంద్ర పాఠశాలలో బిఎస్‌సి మొదటి సంవత్సరం అర్టికల్ విద్యను అభసిస్తున్నాడు. అర్టికల్ నేషనల్ లెవెల్ యూత్ ఫెస్టివల్ విజ్ఞాన్ మహెూత్సవం ఆన్లైన్ ఫోటోగ్రఫీ కాంపిటీషన్ పోటీలలో భారతదేశంలో అన్ని రాష్ట్రాల నుండి అనేక మంది పోటీ చేయగా గుడివాడకు చెందిన సంతోష్ ప్రథమ బహుమతి అందుకోవడం పట్ల పలువరు అభినందించారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండలం, యండకుదురు పంచాయతీ శివారు జీలగలగండి గ్రామంలోని యెరూషలేము ప్రార్థన మందిర ప్రతిష్ట వార్షికోత్సవం మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ శీరం సీమోను ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా పాస్టర్ కె.యేసు ముత్యాలు దైవసందేశం అందించారు. అనంతరం చర్చిలోని వద్ధులు, వితంతువులు, పేద మహిళలకు అవనిగడ్డకు చెందిన శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్ కిషోర్ నాయుడు సహకారంతో ఏర్పాటు చేసిన దుప్పట్లను వారి కుమారుడు తోట శ్యామ్ కష్ణ చేతులు మీదగా పంపిణీ చేశారు.

న్యాయవాదుల నిరసనలకు టిడిపి సంఘీభావం

సంఘీభావం తెలుపుతున్న కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ప్రజల హక్కులను హరించే ఏపీ భూ యాజమాన్య హక్కుల చట్టం తక్షణమే రీకాల్ చేయాలని డిమాండ్ చేస్తూ మచిలీపట్నం న్యాయవాదుల సంఘం, ఆధ్వర్యంలో న్యాయవాదులు, న్యాయవాదుల గుమస్తాలు జిల్లా కోర్టు ఆవరణలో చేస్తున్న నిరసనలకు మాజీ మంత్రి టిడిపి పోలిట్ బ్యూరో కొల్లు రవీంద్ర సంఘీ భావం తెలిపారు. అనంతరం రవీంద్ర మాట్లాడుతూ నూతన చట్టం ఏకపక్షంగా రాత్రికి రాత్రి తీసుకురావడంతో దీన్ని చీకటి చట్టంగా అభివర్ణించారు. సివిల్ కోర్టు యొక్క పరిధిని తగ్గిస్తూ ప్రజల భూమి యాజమాన్యాన్ని నిర్ణయించే హక్కు ప్రభుత్వం చే నియమించిన అధికారికి అప్పగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.ఆ ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రశ్నించాలంటే ప్రజలు హైకోర్టుకు వెళ్లాలనే నిబంధన ఆ చట్టంలో పెట్టడం వల్ల న్యాయం ప్రజలకు అందుబాటులో లేకుండా పోతుందన్నారు . ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు, తుంగల హరిబాబు, ప్రధాన కార్యదర్శి, కొట్టి రఘురాం, న్యాయవాదుల గుమస్తాల సంఘం ప్రధాన కార్యదర్శి, పి. వి. ఫణి కుమార్, న్యాయవాదులు, లంకే వెంకటేశ్వరరావు, కూనపు రెడ్డి శ్రీనివాస్, తాత రవి, టీ సత్యనారాయణ, జీవీఎల్ నరసింహారావు, పుప్పాల ప్రసాద్, మాదివాడ వెంకట నరసింహారావు, అజ్మతున్నీసా బేగం, లావణ్య, రమాదేవి, సర్వ లలిత కుమారి, ఎం సురేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి కోడూరు : నేటి పరిస్థితుల్లో భూ హక్కు చట్టం ద్వారా నిర్ణయాత్మక అధికారాలు తహసీల్దార్,లేక స్థానిక ప్రజాప్రతినిధులు ప్రతిపాదించిన వారి చేతుల్లో ఉంచటం అత్యంత ప్రమాదకరమనీ భూ హక్కు చట్టానికి వ్యతిరేఖంగా ప్రజల్ని చైతన్యపరచాలని న్యాయవాది పరుచూరి రాఘవేంద్రరావు అన్నారు. కోడూరు లోని గొల్లపాలెం రోడ్డు నందు మార్క్సిస్ట్ భవనంలో స్థానిక రైతు సంఘం నాయకులు రైతు కూలి సంఘం నాయకులు ఆధ్వర్యంలో రైతులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భూ హక్కు చట్టం ప్రజల ఆస్థులకు, జీవన మనుగడకు ఇబ్బందిక రమన్నారు. చట్టం అమలైతే న్యాయ, రెవెన్యూ, రిజిస్ట్రీ అధికారాలన్నీ ఒకేచోట కేంద్రీకతమవుతాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకురావటం దురదష్టక రమన్నారు. కోడూరు మండల రైతు సంఘం నాయకులు ఆవులు బసవయ్య రేపల్లె యోగ ప్రకాష్, జొన్నలగడ్డ గోపాలరావు రైతు కూలి సంఘం నాయకులు సింగొత్తు నాగేంద్రం పాల్గొన్నారు.

పాల సేకరణలో పురోగతి సాధించాలి

ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా) : జిల్లాలో జగనన్న పాలవెల్లువ రెండో దశ కింద చేపట్టిన 8 మండలాల్లో ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకొని పాల సేకరణలో మంచి పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు.బుధవారం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ స్పందన సమావేశం మందిరంలో జగనన్న పాలవెల్లువపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జగనన్న పాల వెల్లువ రెండవ దశలో 8 మండలాల్లో ఏర్పాటుచేసిన 69 అమూల్ పాల కేంద్రాల్లో పాల సేకరణ సరైన పురోగతి లేదన్నారు. సమావేశానికి హాజరైన ఎంపీడీవోలు, ఏపిఎంలు, మెంటార్లు, సహకార సంఘాల ప్రతినిధులు ప్రతి ఒక్కరూ ఒక్కో పాల కేంద్రాన్ని బాధ్యత తీసుకొని అక్కడి రైతులతో సమావేశం నిర్వహించి పాలు పోసే విధంగా ప్రోత్సహించాలన్నారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, డి ఆర్డి ఎ పి డి పిఎస్ఆర్ ప్రసాద్, జిల్లా పశు సంవర్ధక అధికారి శ్రీనివాసరావు, డి సి ఓ ఫణికుమార్, అమూల్ రాష్ట్ర సమన్వయకర్త ధీరజ్, రాష్ట్ర పాల అభివద్ధి సంస్థ జిల్లా సమన్వయకర్త ఐ కష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉప కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం మండలంలోని కరగ్రహారం జగనన్న లేఔట్ డి బ్లాక్ నందు బుధవారం విద్యుత్ ఉప కేంద్రాన్ని మచిలీపట్నం శాసనసభ్యులు పేర్ని వెంకట్రామయ్య (నాని) ప్రారంభించారు.నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ ,మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, పట్టణ అధ్యక్షులు షైక్ సిలర్ దాదా,వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, డివిజన్ల ఇంచార్జ్ లు ,కో ఆప్షన్ సభ్యులు మట్టా తులసమ్మ , మచిలీపట్నం మునిసిపల్ కమిషనర్ బాపిరాజు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-పమిడిముక్కల : సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కషి చేస్తానని జిల్లా జేఏసీ అధ్యక్షులు జాన్ మోడీ అన్నారు. బుధవారం పమిడిముక్కల మండలం లోని విద్యా వనరుల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ సర్వశిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం మచిలీపట్నంలోని సిఐటి ఆఫీసులో జాన్ మోడీని జేఏసి జిల్లా అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ప్రస్తుతం జాన్ మోడీ తోట్లవల్లూరు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దేవరపల్లి పాఠశాల సిఆర్‌ఎంటిగా పనిచేస్తున్నారు.అలాగే పమిడిముక్కల మండలంలోని అల్లినాకిపాలెం ఉర్దూ పాఠశాల సిఆర్‌ఎంటి గా పనిచేస్తున్న శ్రీహరి కుమార్ జిల్లా సభ్యునిగా ఎన్నికైన సందర్భంగా పలువురు సీఆర్పీలు అభినందించారు. ఈ కార్యక్రమంలో రవితేజ, రాకేష్, లెనిన్ బాబు పాల్గొన్నారు.

బందరులో 'జయహో బిసి'

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : బీసీలు అంతా ఏకతాటిపై వచ్చి జగన్ ప్రభుత్వాన్ని ఓడించాలని మాజీ మంత్రి , టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర పిలుపు నిచ్చారు.మచిలీపట్నం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బైపాస్ రోడ్‌లో జయహెూ బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ జగన్ రెడ్డి ప్రభుత్వంలో బీసీలకు జరిగిన అన్యాయాలను వివరిస్తూ రాబోయే తెలుగుదేశం ప్రభుత్వం కల్పించే హక్కులను తెలియజేస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు కొనకళ్ల నారాయణ రావు, పలువురు బిసి సంఘాల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డిఎస్ఇఒ సుబ్బారావు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : ఎన్‌టిఆర్ జిల్లా పాఠశాల విద్యాధికారి (డిఎస్ఇఒ)గా బుధవారం విధుల్లో చేరిన యువి సుబ్బారావు కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ఎస్.డిల్లీరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ వివిధ పథకాలు, కార్యక్రమాలను అమలుచేస్తోందన్నారు. పాఠశాలల్లో కల్పిస్తున్న మౌలిక వసతులు, సాంకేతిక పరికరాలను సద్వినియోగం చేసుకొని ఉపాధ్యాయులు మంచి విద్యాబోధన అందించడం ద్వారా ఫలితాల సాధనలో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు కృషిచేయాలన్నారు. 1989లో కృష్ణా జిల్లా డిఇఒ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా చేరిన సుబ్బారావు తర్వాత వివిధ హోదాల్లో పనిచేసి 2020 నుంచి డివైఇఒగా మచిలీపట్నంలో పనిచేసి ఇప్పుడు ఎన్‌టీఆర్ జిల్లా డిఎస్ఇఒగా బాధ్యతలు చేపట్టారు.

టాటా ఎఐఎ కంపెనీకి సిఇఒగా వెంకటాచలం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : టాటా ఎఐఎ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలిమిటెడ్ కొత్త చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా హెచ్.వెంకటాచలం నియమితులయ్యారు. ప్రస్తుత చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నవీన్‌నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారని సంస్థ ప్రతినిధి కె.రామకుమార్‌రావు తెలిపారు. అసెస్ మేనేజ్‌మెంట్, కస్టోడియల్ సర్వీసెస్‌లో 27 సంవత్సరాల అనుభవం కొత్త సిఇఒకు ఉందని తెలిపారు. సేల్స్, డిస్ట్రిబ్యూషన్, స్ట్రాటజీ, బిజినెస్ అండ్ ప్రాసెస్ డెవలప్‌మెంట్, కీ అకౌంట్ మేనేజ్‌మెంట్‌లో మంచినైపుణ్యం ఉందని తెలిపారు. ఆయన 2016లో టాటా ఎఐఎలో చేరానని, ఈ బాధ్యతలు చేపట్టకముందు ప్రెసిడెంట్, చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్‌గా ఉన్నారని తెలిపారు.

తమ్మినేనికి పరామర్శ

ప్రజాశక్తి - గంపలగూడెం : సిపిఎం సీనియర్ నాయ కులు తమ్మినేని వీరభద్రం ఇటీవల గుండె సంబం ధిత వ్యాధితో ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిందే. విష యం తెలుసుకున్న స్థానిక సిపిఎం ప్రతినిధులు ఖమ్మం - తెల్లదేవరపల్లిలో తన నివాసానికి వెళ్లి పరామర్శించారు. తనకున్న ఇబ్బందుల విషయమై అడిగి తెలుసుకున్నారు. సీనియర్ నాయకులు చెరుకు వీరారెడ్డి, మల్లవరపు కుటుంబ రావు, పోతురాజు లావణ్య, గుంటుపల్లి వీరభద్రం ఉన్నారు.

ఎంఎల్ఎ టికెట్‌కు ధర్మారావు దరఖాస్తు

ప్రజాశక్తి - చందర్లపాడు : చింతలపాడు గ్రామానికి చెందిన చందర్లపాడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కురగంటి ధర్మారావు నందిగామ నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ కొరకు దరఖాస్తు అందజేశారు. విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం అందజేశారు. అనంతరం విజయవాడ సిటీ కాంగ్రెస్ నాయకులు నరహరశెట్టి నరసింహారావును ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా చందర్లపాడు మండల కాంగ్రెస్ అధ్యక్షుడుగా ప్రజలకు సేవలందించిన తనకు నందిగామ నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని ఆయన కోరారు.

శతాబ్ది ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : దేవుని తల్లి అయిన మరియమాత కతోలిక క్రైస్తవుల కల్పవల్లిగా విరాజిల్లుతుందని కడప మేత్రాసనం రెవరెంట్ ఫాదర్ సగిలి ప్రకాశ్ అన్నారు. గుణదల మేరిమాత శతాబ్ది మహోత్సవ నవదిన వేడుకలలో భాగంగా బుధవారం సాయంత్రం జరిగిన నవదిన ప్రార్థనలకు ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన యాత్రికులకు సందేశమిస్తూ మహోన్నతుడైన యేసుప్రభువును అందించిన మాతృమూర్తి మరియమాత అన్నారు. క్రైస్తవుల కల్పవల్లిగా మరియమాత కీర్తించబడుతుందని అన్నారు. శతాబ్ది మహోత్సవాలు జరుపుకుంటున్న గుణదల మాత పుణ్యక్షేత్రం చరిత్రపుటల్లో నూతన అధ్యాయంగా నిలిచిపోతుందన్నారు. విజయవాడ కతోలిక పీఠం మోన్సిగ్నోర్ రెవరెంట్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు స్వామి మాట్లాడుతూ 100 వసంతాల వేడుకలకు ఒక రోజుమాత్రమే ఉండటంతో ఉత్సవాలకు వచ్చే యాత్రికుల కోసం దాదాపు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అంతకుముందు పుణ్యక్షేత్రం ప్రదాన చర్చినుండి ముఖ్య అతిథి ఫాదర్ సగిలి ప్రకాశ్‌తో కలిసిగురువులు దివ్యసత్ప్రసాద ఆరాధనతో కొండపై లూర్ధుమాత వద్దకుచేరుకున్నారు. అనంతరం ఫాదర్స్ కొండపై మరియమాత స్వరూపం వద్ద సమిష్టి దివ్య పూజాబలి సమర్పించారు. క్రీస్తురాజపురం, వణుకూరు, ఎనికేపాడు, తదితర విచారణల నుండి వచ్చిన భక్తులు విజయవాడ మేత్రాసనం గుణదల మాత పుణ్యక్షేత్రం అభివృద్ధికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫాదర్ యం.చిన్నప్ప, సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ పసల తోట సునీల్ రాజు, ఫాదర్ కామాక్రీస్తురాజు, తదితర గురువులు, మఠకన్యలు, గురువులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సగిలి ప్రకాశ్

ఇగ్నో ప్రాంతీయ కేంద్రం శాశ్వత భవనానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించి విజయవాడలో ప్రాంతీయ కేంద్రం శాశ్వత భవన నిర్మాణానికి శంకుస్థాపన అమరావతి, రాయపూడి గ్రామంలో బుధవారం జరిగింది. విజయవాడ ప్రాంతీయ కేంద్ర సంచాలకులు డాక్టర్ కె.సుమలత ఆధ్వర్యంలో జరిగిన భూమిపూజ కార్యక్రమంలో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్ర సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు, ఒడిశాలోని అన్గుల్ ప్రాంతీయ కేంద్ర సంచాలకులు, డాక్టర్ మనోజ్ కుమార్ దాస్ అతిథులుగా పాల్గొన్నారు. బుధవారం సాయంత్రం సిపిడబ్ల్యూడి కార్యాలయ ఆవరణలో జరిగిన శిలాఫలకం ఆవిష్కరణలో కేంద్ర విద్యాశాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆన్లైన్ వేదికగా పాల్గొన్నారు. దీనితో పాటు దేశంలోని మరో ఆరు ప్రాంతీయ కేంద్రాల శాశ్వత భవనాల ప్రారంభోత్సవం కూడా ఆన్లైన్ విధానంలో ఇగ్నో కులపతి ఆచార్య నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. శాశ్వత భవన నిర్మాణం ద్వారా మరింత మెరుగైన విద్యార్థి సేవలందించే వీలు కలుగుతుందన్నారు. ఇగ్నో కులపతి ఆచార్య నాగేశ్వరరావు మాట్లాడుతూ నిర్మాణం పూర్తి చేసుకున్న ఆరు ప్రాంతీయ కేంద్రాల ప్రారంభోత్సవంతో పాటు విజయవాడ భవనానికి శంకుస్థాపన జరగడం ఎంతో హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా జరిగిన శిలాఫలక ఆవిష్కరణ కూడా అంతర్జాల వేదికగా మంత్రి చేతులమీదుగా జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిడబ్ల్యూడి ముఖ్య ఇంజనీరు ఎమ్. వెంకటేశ్వరరావు, కార్యనిర్వాహక ఇంజనీరు, కె.కష్ణకిశోర్, ఇగ్నో విజయవాడ ప్రాంతీయ కేంద్ర ఉప సంచాలకులు డా.బి.ప్రసాద్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రత పౌరుల బాధ్యత

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : దురలవాట్లకు దూరంగా ఉంటే రోడ్డు ప్రమాదాలు నివారించే వీలుంటుందని రాష్ట్ర జాయింట్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ సిహెచ్. శ్రీదేవి అన్నారు. ది కష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 35వ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం విజయవాడలో కష్ణాడిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ హాలులో అధ్యక్షులు నాగమోతు రాజా అధ్యక్షతన రహదారి భద్రతా సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడుతూ గత ఏడాది రాష్ట్రంలో 20 వేల రోడ్డు ప్రమాదాలు జరగగా, ఎనిమిది వేలమంది మతి చెందారని, రహదారి ప్రమాదాల్లో విజయవాడ ఐదో స్థానం నుంచి మొదటి స్థానానికి వచ్చిందన్నారు. ఈనేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వాహనం నడపాలని కష్ణా,ఎన్టీఆర్ జిల్లాల డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ ఎం.పురేంద్ర మాట్లాడుతూ దేశంలో వాహనాలు ఏకంగా 40 కోట్లకు పెరిగాయని, మంచి రహదారులున్నా ప్రమాదాలు తప్పడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. దేశంలో లక్షా 60 వేల ప్రమాదాలు జరిగాయని, లక్షన్నర మంది మతి చెందారని, మానవ వనరులను మనం కోల్పోవడం దురదష్టకరమన్నారు. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ డిప్యూటి జనరల్ మేనేజర్ (టెక్నికల్) ఎం.కె.చౌదరి మాట్లాడుతూ హైవేపై ప్రతి 50 కిమీ పరిధిలో అంబులెన్స్, పెట్రోలింగ్ వాహనం అందుబాటులో ఉంచామని, 108కి బదులు టోల్ ఫ్రీ నంబరు 1033 కు కాల్ చేస్తే తక్షణ సాయం అందిస్తామన్నారు. పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ అసహనం, అశ్రద్ధవల్లే ఎక్కువగా రోడ్డుప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రధాన కార్యదర్శి అల్లాడ వీరవెంకట సత్యనారాయణ, కార్యదర్శి రావి శరత్ బాబు, కోశాధికారి పొట్లూరి చంద్రశేఖరరావు, ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.వి.ఈశ్వరరావు, సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు కోనేరు వెంకట రమేష్, కే జగదీశ్వరరావు, ఫౌండేషన్ అధ్యక్ష కార్యదర్శులు కేవీ రామారావు, కె సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీదేవి

కుష్టు వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి - వత్సవాయి : జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాల్లో భాగంగా మ్యాన్‌కైండ్ ఫార్మా వారి సహకారంతో లెప్రా సొసైటీ వారి ద్వారా స్థానిక వత్సవాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర సమన్వయకర్త రాధిక మాట్లాడుతూ తమ సంస్థ సహకారంతో విజయవాడ ఆర్‌సి పరిధిలో జిల్లా వ్యాప్తంగా వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంస్థ ప్రాజెక్టు ఫిజియోథెరపిస్టు ఎం.నాగరాజు వ్యాధి ప్రారంభ లక్షణాలు, చికిత్స అంగవైకల్యాలు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ సుష్మా ప్రియదర్శిని, డాక్టర్ అర్షిదా ఉన్నీషా అందరితో కుష్టు వ్యాధి నిర్మూలన గురించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది లేప్రా సొసైటీ శ్రేయస్సు సిబ్బంది, ఎఎన్ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల అరెస్టు

ప్రజాశక్తి - నందిగామ : తమ సమస్యలు పరిష్కరించాలని 8న (నేడు) చలో విజయ వాడకు తరలివెళ్లనున్న ఆశ వర్కర్లను ముందుగా అరెస్టులు చేసి నందిగామ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మండల ఆశ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి నల్లని నాగమణిని హౌస్ అరెస్టు చేశారు. సిఐటియు నాయకులు కటారపు గోపాల్ తీవ్రంగా ఖండించారు.

డిఎలు మంజూరుపై హర్షం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : గ్రామ రెవెన్యూ సహాయకులకు రాష్ట్ర ప్రభుత్వం డిఎ 500లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వడం పట్ల ఉద్యోగులు హర్షం వ్యక్తంచేశారు. ఈ సదంర్భంగా గ్రామ రెవిన్యూ సహాయకుల సంఘాల జెఎసి ఆధ్వర్యంలో నగరంలోని అసోసియేషన్ కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ జెఎసి చైర్మన్ వి.ఎస్.దివాకర్, గ్రామ రెవిన్య సహాయ కుల రాష్ట్ర సంఘాల అధ్యక్షులు పెద్దన్న, ప్రధాన కార్యదర్శులు సత్తిరాజు, జిల్లా అధ్యక్షులు గణేష్, వెంకటరత్నం జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలంలో వార్డు సచివాలయాలను నందిగామ రెవెన్యూ డివిజనల్ అధికారి పి.సాయిబాబు నవరత్నాలు పేదలందరికీ ఇండ్లను గ్రామ సచివాలయం ద్వారా రిజిస్ట్రేషన్ చేసే ప్రక్రియను తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ళను రిజిస్ట్రేషన్ చేస్కోవాలని ఆర్‌డిఒ సాయిబాబు పేర్కొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - విజయవాడ : రాష్ట్రంలోని ప్రజలందరికీ మంచి ఆరోగ్యాన్ని అందించడమే లక్ష్యంగా సీఎం జగన్మోహన్ రెడ్డి నేతత్వంలో ప్రభుత్వం అహర్నిశలు పనిచేస్తోందని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. నియోజకవర్గంలో ఐదుగురికి మంజూరైన రూ. 9.95 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనములో బుధవారం ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు. గత నాలుగు న్నరేళ్లలో 1,057 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ. 7.53 లక్షలు సాయం అందజేసినట్లు తెలిపారు.

'కరీం' నగర బహిష్కరణ పొడిగింపు

ప్రజాశక్తి - విజయవాడ : శాంతి భద్రతలకు విఘాతం కలిగించే 'మహమ్మద్ కరీం' నగర బహిష్కరణను మరో ఆరు నెలలు పొడిగిస్తూ నగర పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నగరంలో శాంతి భద్రతలకు, సామాన్య ప్రజా జీవనానికి విఘాతం కలిగిస్తూ, అవాంఛనీయ సంఘటనలకు, అల్లర్లకు పాల్పడి, సమాజంలో అలజడి సష్టిస్తున్న 'నున్న' పోలీస్ స్టేషన్ పరిధి, వాంబే కాలనీ కు చెందిన మహమ్మద్ కరీం ప్రజా శాంతి భద్రతల పరిరక్షణకు విఘాతం కలిగిస్తున్నందున ఆరు నెలల పాటు నగరం నుండి బహిషరించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో కరీం బహిష్కరణను మరో ఆరు నెలలు పొడిగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.